నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికి అందం**



చైనీయుల, జపనీయుల
వైనమ్మును తెలియగోరి వాణిజ్యములో
వైనత్యుడైన మోడీ
పైనట్టుగ పయనమయ్యె పర సీమలకున్ !!

(వ్యాపార అవసరాల కోసం, ప్రధాని మోడీ చైనా జపాన్ దేశాల పర్యటనకు ఈరోజు బయలుదేరారు)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com


**చురక**

స్వదేశీ నినాదం
స్వర్వత్రా మంచికే
స్వయంగా ఉత్పత్తి
చేయకుంటే కంచికే
గ్లోబలైజ్ మార్కెట్టులో
గంతులేసే ప్రభుత్వం
సాధించుడు గగనమే
స్వయంవృద్ధి జవసత్వం



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 31-8-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:25 పేజీలు:6 వెల: రూ.1/-

# గోదావరి ఉగ్రరూపం.. బాసర సరస్వతి ఆలయం వరకు వరద..



హైదరాబాద్, ఆగష్టు 30: ఎగువన భారీ వర్షాతో బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. వరద పెరడంతో బాసర పట్టణం జలదిగ్బంధమైంది. సరస్వతి ఆలయం వరకు ప్రధాన రహదారి జలమయమైంది. వ్యాస మహర్షి గుడి, ఆలయ ఆవరణలోని టీటీడీ గృహాల వరకు వరద చేరింది. ఆలయం వద్ద దుకాణాలు, ప్రైవేటు లాడ్జ్‌లు, సత్రాలు, పుష్కరఘాట్ నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే దారి నీటమునిగాయి. గోదావరిపై వంతెనను తాకుతూ వరద ప్రవహిస్తుండటంతో గంగాదేవి, సూర్యేశ్వర శివాలయం, అక్షర కాలనీ, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు, వైశ్య సత్రం వరకు బ్యాక్ వాటర్ చేరాయి.

అక్షర కాలనీలో వరద నీటిలో చిక్కుకున్న వారిని అధికారులు ట్రాక్టర్ల సహాయంతో తరలించారు. వరద చుట్టుముట్టడంతో నాగభూషణ్ విద్యాలయంలో 30 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు చిక్కుకున్నారు. దీంతో వారంతా భవనంపై అంతస్తుకు వెళ్లారు. దీంతో వారిని బయటకు తీసుకొచ్చేందుకు వెళ్లిన 8 మంది కూడా వరద నీటిలో చిక్కుకుపోయారు. కాగా, మరికొన్ని గంటల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



# క్లాస్ లుక్ ఉన్న మాస్ లీడర్ గోపీనాథ్.. ఆయన మరణం తీరని లోటు: సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగష్టు 30: తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాసనసభ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజున ఆయన గోపీనాథ్ గారి సేవలను స్మరించుకుంటూ అసెంబ్లీలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. గోపీనాథ్ తనకు చిన్ననాటి నుంచే మిత్రుడని పేర్కొన్నారు. ఆయన మృతి తనను వ్యక్తిగతంగా తీవ్రంగా కలిచివేసిందని గోపీనాథ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్ మాగంటి గోపీనాథ్ జీవన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. రాజకీయంగా పార్టీలు వేరైనా.. వ్యక్తిగతంగా నాకు మంచి మిత్రుడని తెలిపారు. ఆయన విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా ఉన్నారని అన్నారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని.. 1985 నుండి 1992 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తెలుగు యువత అధ్యక్షుడిగా సేవలందించారని తెలిపారు .1987-88 లో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా 1988-93 లో జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడిగా విశేష కృషి చేశారు.

గోపీ ఎన్టీఆర్‌కు గొప్ప భక్తుడు. సినీరంగంలోనూ నిర్మాతగా రాణించారు. సినిమా రంగంపై అభిమానంతో 'పాతబస్తీ'(1995), 'రవన్న'(2000), 'భద్రాద్రి రాముడు' (2004), 'నా స్టైలే వేరు' (2009) వంటి నాలుగు సినిమాలకు గోపీనాథ్ నిర్మాతగా వ్యవహరించారని స్మరించుకున్నారు. వరసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ఘనత సాధించిన వారిలో మాగంటి గోపీనాథ్ ఒకరని అసెంబ్లీలో సీఎం రేవంత్ తెలియజేశారు. చూడటానికి ఆయన క్లాస్‌గా కనిపించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆయన మాస్ లీడర్ అని అన్నారు. గోపీనాథ్ అకాల మరణం వారి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చిందని.. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

## గణపతి బప్పా మోరియా.. కావాలయ్య యూరియా! బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వినూత్న ప్రదర్శన

హైదరాబాద్, ఆగష్టు 30: రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్కు వద్ద వినూత్న నిరసన ప్రదర్శన నిర్వహించారు. అసెంబ్లీకి వెళ్లే ముందు గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఖాళీ యూరియా బస్తాలతో నిరసన వ్యక్తం చేశారు. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు చేశారు. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది ఈ ప్రభుత్వం అని ధ్వజమెత్తారు. "గణపతి బప్పా మోరియా కావాలయ్యా యూరియా" అంటూ నినదించారు. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు చేశారు. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. "రేవంత్ దోషం- రైతన్నకు మోసం" అంటూ నినాదాలు చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

# కాళేశ్వరం పీపీటీ ప్రజెంటేషన్‌పై మాటల యుద్ధం..



హైదరాబాద్, ఆగష్టు 30: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు కాళేశ్వరంపై అసెంబ్లీలో పీపీటీ ప్రజెంటేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ నాయకులకు మధ్య మాటలయుద్ధం మొదలయ్యింది. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావు మీడియాతో మాట్లాడారు.. అసెంబ్లీలో పీపీటీ ఇస్తామని చెప్పంటే.. కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని ఆరోపించారు. పీపీటీకి అవకాశం ఇవ్వడం లేదంటే.. వాస్తవాలను వినడానికి సిద్ధంగా లేరని అర్థం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని గుర్తు చేశారు.

మంత్రి శ్రీధర్ బాబు మాటలు చూస్తుంటే.. ఆయనకు వాస్తవాన్ని అంగీకరించడం ఇష్టం లేదని తెలుస్తోందని చురకలు పెట్టారు. ఏ విషయం గురించైనా నిజానిజాలు కోర్టులో తెలుస్తాయని హరీష్ రావు స్పష్టం చేశారు.

అయితే.. హరీష్ రావు మాట్లాడిన మాటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. ప్రతిపక్షాలకు అసెంబ్లీలో పీపీటీ ప్రజెంటేషన్ ఇచ్చే సాంప్రదాయం లేదని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తమకు పీపీటీ అవకాశం ఇవ్వాలని లేఖ కూడా రాసినట్లు గుర్తుచేశారు. అయినా తమకు అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. అప్పుడు లేనిది ఇప్పుడు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 6500 కోట్లు వడ్డీ కట్టడంలేదని బీఆర్ఎస్ చేస్తోన్న వాదన సరికాదని విమర్శించారు. వడ్డీ తాము కట్టకపోతే.. బీఆర్ఎస్ నేతలు కడుతున్నారా.. అని భట్టి నిలదీశారు.

# అసెంబ్లీలో కాళేశ్వరంపై చర్చకు వ్యూహం రచిస్తున్న బీఆర్ఎస్..



హైదరాబాద్, ఆగష్టు 30: మొదటి రోజు వాడీవేడిగా సాగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ముగిసాయి. రేపు(ఆదివారం) ఉదయం 9 గంటలకు అసెంబ్లీ వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. అయితే రేపు కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ వాయిదా అనంతరం అసెంబ్లీ లాబీలో బీఆర్ఎస్ నేతల నిరసన చేపట్టారు. గణపతి బప్పా మోరియా.. కావాలండీ యూరియా.. అంటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. అయితే.. సభ వాయిదా అనంతరం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్, హరీశ్ రావు సమావేశం కానున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుచరించాల్సిన వ్యూహంపై వారు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఎరువుల కొరతపై బీఆర్ఎస్ రేపు వాయిదా తీర్మానం ఇవ్వనుంది. రేపు కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చలు జరుగుతాయని తెలుస్తోంది. కాగా, ఇప్పటికే అసెంబ్లీలో కాళేశ్వరంపై పీపీటీ ప్రజెంటేషన్ ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. అయితే బీఆర్ఎస్ నేతలకు పీపీటీ ప్రజెంటేషన్ అవకాశం ఇవ్వబోమని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ అంశంలో మరోసారి బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల యుద్ధం మొదలయ్యింది.

# సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు.. తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్, ఆగష్టు 30:స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే దానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెర దింపింది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇవాళ భేటీ అయిన తెలంగాణ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు చేసింది. స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం పేర్లను గవర్నర్‌కు క్యాబినెట్ సిఫార్సు చేసింది.

అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఈ మంత్రివర్గ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంతోపాటు, ఇటీవలి వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంపైనా చర్చించారు. పంటలు, రోడ్లు, ఇతర నష్టాలపై కేంద్ర ఆర్థికశాఖ సాయం కోరుతూ తీర్మానం చేశారు. మరోవైపు సెప్టెంబర్ 30 లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

# బెంగళూరు తొక్కిసలాట ఘటన.. ఆర్‌సీబీ కీలక ప్రకటన

న్యూఢిల్లీ, ఆగష్టు 30:బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటనపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు నష్ట పరిహారం ప్రకటించింది.

ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 25 లక్షలు ఇవ్వనున్నట్లు శనివారం ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేసింది. బెంగళూరులో జరిగిన దురదృష్టకర ఘటన ఆర్‌సీబీ కుటుంబానికి తీవ్ర బాధను కలిగించినట్లు పేర్కొంది. బాధిత కుటుంబాలకు అండగా ఉండేందుకు ఆర్‌సీబీ కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

కాగా, ఇప్పటికే ఆర్‌సీబీ బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఖీఅః కేర్స్ పేరిట ఫండ్ ఏర్పాటు చేసి గాయపడిన వారికి సాయం చేస్తామని అప్పట్లో ప్రకటించింది. ఇప్పుడు నష్ట పరిహారం రూ. 25 లక్షలుగా ప్రకటించడం గమనార్హం.

# జమ్మూకశ్మీర్‌లో మరో క్లౌడ్ బరస్ట్.. పలువురు మృతి



జమ్మూకశ్మీర్ ఆగష్టు 30:జమ్మూకశ్మీర్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఉత్తరాన కశ్మీర్ నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు.. పశ్చిమాన రాణ్ ఆఫ్ కచ్ నుంచి తూర్పున దీపూపాస్ వరకు అంతటా భారీ వర్షాలు, వరదల బీభత్సం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో రాంబాన్ జిల్లాలో మరో క్లౌడ్ బరస్ట్ సంభవించింది. ఈ విపత్తులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గల్లంతైనట్లు తెలుస్తోంది. ఈ సంఘటనలో మరణించిన ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మృతిచెందిన వారిలో ఇద్దరు మహిళలను గుర్తించినట్లు పేర్కొన్నారు.

గత కొన్ని రోజులుగా జమ్మూకశ్మీర్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

దీని ఫలితంగా కేంద్రపాలిత ప్రాంతంలో అనేక క్లౌడ్ బరస్టులు, ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయి. నిన్న(శుక్రవారం) కూడా బండిపోరా జిల్లాలోని గురేజ్ సెక్టార్‌లో మరో క్లౌడ్ బరస్ట్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని స్పష్టం చేశారు.

భారీ వర్షాల కారణంగా పరిస్థితి మరింత దిగజారుతుందని ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు 2014లో కశ్మీర్‌లో వరదలు వచ్చిన తర్వాత ప్రకటించిన రూ. 80,000 కోట్ల ప్యాకేజీని జమ్మూ ప్రాంతానికి రెట్టింపు మంజూరు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరినట్లు తెలిపారు.

# అల్లు వారింట తీవ్ర విషాదం..

హైదరాబాద్, ఆగష్టు 30:అల్లు వారింట తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తల్లి అల్లు అర్జున్ నానమ్మ అల్లు కనకరత్నం(94) కన్నుమూశారు. ఇవాళ(శనివారం) తెల్లవారుజామున ఆమె తుది శ్వాస విడిచారు. కాగా, ఇవాళ(శనివారం) మధ్యాహ్నం కోకాపేటలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు, బంధువులు వెల్లడించారు.

దివంగత నటుడు అల్లు రామలింగయ్య భార్య కనకరత్నం గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అనారోగ్యం కారణంగా ఆమె ఇవాళ తెల్లవారుజామున కన్నుమూశారు. అయితే అల్లు అర్జున్ ప్రస్తుతం ముంబైలో అట్లీ దర్శకత్వం వహిస్తున్న సినిమా పనుల్లో ఉన్నారు. ఆయనకు విషయం తెలిసిన వెంటనే ముంబై నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకున్నట్లు సమాచారం. సినీ పరిశ్రమలో ప్రముఖ ప్రొడ్యూసర్ అయిన అల్లు అరవింద్ తల్లి కన్నుమూయడంతో టాలీవుడ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పలువురు సినీ ప్రముఖులు, నేతలు అల్లు కనకరత్నం మృతికి సంతాపం తెలుపుతున్నారు.

## మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

ఖమ్మం, ఆగష్టు 30:ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా సింగరేణి (కారేపల్లి) మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ (రామలింగాపురం) గ్రామానికి చెందిన షేక్ గోర్ పాషా (30)కి తల్లాడ మండలం కల కోడిమ గ్రామానికి చెందిన అనూషతో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి 15 నెలల బాబు ఉన్నాడు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో అనూష పుట్టింటికి వెళ్లింది. దీంతో మానసికంగా ఆవేదనకు గురైన గోర్ పాషా శనివారం తెల్లవారుజామున వంటింట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి జానీమియా ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ బైరు గోపి కేసు నమోదు చేశారు.

# బీసీ రిజర్వేషన్లపై సంచలన నిర్ణయం!

హైదరాబాద్, ఆగష్టు 30: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై సంచలన నిర్ణయం తీసుకుంది. రిజర్వేషన్ల కోటా పరిమితి ఎత్తివేస్తూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సంచలన నిర్ణయం ద్వారా 50% రిజర్వేషన్ సీలింగ్ (కోటా పరిమితి) ను సడలించడాన్ని టార్గెట్ చేస్తోంది. ఈ దిశగా ప్రత్యేక జీవో (గవర్నమెంట్ ఆర్డర్) జారీ చేయడానికి సిద్ధం అవుతోంది. తెలంగాణ ప్రభుత్వం 42% బీసీ రిజర్వేషన్ ను ప్రత్యేక జీవో ద్వారా అమలు చేయనుంది.

పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285(ం) లో సవరణలు చేయాలని కూడా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సవరణతో బీసీ వర్గాలకు పంచాయతీ రాజ్ ఎన్నికలలో అధిక రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉంటుంది. ఈ సవరణ ద్వారా, బీసీ వర్గాలు ప్రాతినిధ్యం పెంచుకొని, వారికి మరింత స్థానం, అధిక అవకాశాలు కల్పించడానికి మద్దతు లభిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం 50% సీలింగ్‌ను సడలించేందుకు చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టే నిమిత్తం ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనితో, రిజర్వేషన్ల కోటా పరిమితిని నెమ్మదిగా పెంచవచ్చు. ప్రస్తుతం దేశంలో ఉన్న 50% రిజర్వేషన్ సీలింగ్ (పరిమితి) ను తొలగించడం ద్వారా, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మరిన్ని అవకాశాలు ఉండనున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఆర్డినెన్స్ కు ఆమోదం లభించకపోవడంతో, జీవో (గవర్నమెంట్ ఆర్డర్) ద్వారా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జీవో ద్వారా, కొత్త రిజర్వేషన్ విధానాన్ని త్వరలో అమలు చేయనుంది. ఈ జీవో కోసం ప్రభుత్వ ఆమోదం ఇప్పటికే సిద్ధం అవుతోంది. ఈ జీవో అమలు చేయడం ద్వారా, తెలంగాణలో బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాలు, పంచాయతీ ఎన్నికలలో మరింత ప్రాతినిధ్యం ఉంటుంది.

# ఇంటిని తరగతి గదిగా మార్చిన దూర విద్య !

## (31 ఆగష్టు "ప్రపంచ దూరవిద్య దినోత్సవం" సందర్భంగా)

"దూర విద్య" లేదా "డిస్టెన్స్ లెర్నింగ్" విధానానికి 300 ఏండ్ల క్రితమే అడుగులు పడడం ప్రారంభమైంది. తొలి ఓపెన్ యూనివర్సిటీ ఇంగ్లాండులో ప్రారంభం చేశారు. తొలి ఆన్‌లైన్ కోర్సులను టొరెంటో యూనివర్సిటీ ప్రారంభించింది. భారత్‌లో తొలి ఓపెన్ యూనివర్సిటీ 1982లో హైదరాబాద్‌లో "డా: బి ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ"గా ప్రారంభమైంది. "భారత దూర విద్య పితామహుడి"గా తెలంగాణ తెలుగు తేజం ఆచార్య జి. రాంరెడ్డిని పిలవడం గర్వకారణంగా ఉన్నది. దూర విద్య రెండు రకాలుగా పరిగణించబడుతుంది. వీటిలో "రిమోట్ లెర్నింగ్" లేదా "దూర విద్యా విధానం" మరియు "హైబ్రిడ్ విధానం" ఉన్నాయి. హైబ్రిడ్ విధానంలో ఆన్‌లైన్ బోధనతో పాటు కొంత మేరకు సాంప్రదాయ తరగతి గది బోధనలు కూడా ఉంటాయి. కోవిడ్ విపత్తు ప్రపంచాన్ని కమ్మిన వేళ ఇంట్లోంచి విద్యార్థులు ఆన్‌లైన్ బోధనా తరగతులు వింటూ తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించడం మనకు తెలుసు. తమ ఇండ్ల నుంచి లేదా పని ప్రదేశం నుంచే విద్యను కొనసాగించడం, సాంప్రదాయక తరగతి హాజరు నియమాలకు దూరంగా ఎక్కడి నుంచైనా చదువుకునే వెసులుబాటు కలిగి ఉండడాన్ని "దూర విద్య" లేదా "డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (లెర్నింగ్)" అని పిలుస్తున్నాం. దూర విద్యలో "కరెస్పాండెన్స్ కోర్సులు", "ఇంటర్నెట్ ఆధారిత ఆన్‌లైన్ కోర్సులు", "సార్వత్రిక (ఓపెన్) విశ్వవిద్యాలయ విద్య", "వీడియో కాన్ఫరెన్సింగ్ కోర్సులు" ఉన్నాయి.

ప్రపంచ దూర విద్య దినోత్సవం:

వివిధ కారణాలతో సాంప్రదాయ విద్యను కొనసాగించలేని ప్రజలకు దూర విద్య బోధనలు ఓ అపూర్వ వరంగా మారుతున్నాయి. మన ఇంటి నుంచి, ఉద్యోగ ఉపాధులు చేసుకుంటూ, మన తీరిక సమయాల్లో చదువుకుంటూ, విద్యాలయానికి వెళ్లి తరగతి గదిలో కూర్చొనవలసిన అవసరం లేకుండా తమకు ఆసక్తి ఉన్న కోర్సులను పూర్తి చేసుకునే అద్భుత అవకాశాన్ని దూర విద్య విధానం కల్పిస్తున్నది. దూర విద్య పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించడానికి, దూర విద్యలో పలు కోర్సులను చేసిన విజేతల అనుభవాలను తెలుసు కోవడానికి అనువుగా ప్రతి ఏట 31 ఆగస్టు రోజున "ప్రపంచ దూర విద్య దినోత్సవం" జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. నేటి డిజిటల్-ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి దూర విద్య అవసరార్థులకు చక్కటి నాణ్యమైన విద్యను అందించడం ముదావహం.

దూర విద్యా విధానం ప్రయోజనాలు:

సాంప్రదాయ తరగతి గదికి వెళ్లకుండా తమ తమ ఇండ్ల నుండి విద్యను నేర్చుకొని, యూనివర్సిటీ పట్టాను పొందగలగడం "దూర విద్య" ప్రసాదించిన వరంగా భావించాలి. వ్యక్తిగత పనులు, ఉద్యోగాలు, ఉపాధులు చేసుకుంటూనే విద్యను కొనసాగించే అవకాశాన్ని వినియోగించుకొని వేల, లక్షల మంది విద్యావంతులు కావడం నేటితరంలో సర్వసాధారణం అయిపోయింది. మనకు అనుకూలంగా, చవకగా, సౌకర్యవంతంగా, అందుబాటులో ఉన్న దూర విద్య ద్వారా ఎంపిక చేసుకున్న కోర్సులో విద్యతో నైపుణ్యాలను కూడా దూర విద్యా విధానం కల్పిస్తున్నది. దూర విద్యా విధానం ద్వారా విదేశీ యూనివర్సిటీల కోర్సులను కూడా మన ఇంట్లో నుంచి పూర్తి చేసే అవకాశాలు నేడు సర్వత్ర అందుబాటులో ఉంటున్నాయి. వయో పరిమితులు లేకుండా కౌమార యువత నుంచి పండు ముసలి వరకు అందరికీ ఈ విద్య అందుబాటులో ఉన్నది. నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక యూనివర్సిటీలు దూరవిద్య కోర్సులను నిర్వహిస్తున్నాయి.

భారత్‌లో దూరవిద్య వ్యాప్తి :

మద్రాస్ యూనివర్సిటీ 1857లో, 1962లో ఢిల్లీ యూనివర్సిటీ కరెస్పాండెన్స్ కోర్సులను ప్రారంభించాయి. 1982లో తొలి సార్వత్రిక విశ్వవిద్యాలయం లేదా ఓపెన్ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో "ఏపీ ఓపెన్ యూనివర్సిటీ" పేరుతో ప్రారంభమైంది. దీనిని 1991లో డా: బి ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ"గా పేరును మార్చడం జరిగింది. భారత తొలి ఓపెన్ యూనివర్సిటీ ఉపకులపతి లేదా విసిగా ఆచార్య డి రాంరెడ్డి సేవలు అందించడం, తదనంతరం ఏర్పాటు చేసిన "ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ"కి కూడా తొలి విసిగా సేవలు అందించడం వల్ల ఆయనను "భారత దూర, సార్వత్రిక విద్య పితామహుడు (ఫాదర్ ఆఫ్ డిస్టెన్స్, ఓపెన్ లెర్నింగ్)"గా పిలవడం జరుగుతోంది. నేటి భారత విశ్వవిద్యాలయాలు పలు రకాలైన యూజీ, పీజీ, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులను దూరవిద్య విధానంలో అమలు చేస్తున్నాయి. ప్రపంచ దూర విద్య దినోత్సవం వేదికగా నేటి యువత తమ కుటుంబ నేపథ్యానికి, వ్యక్తిగత జీవితాలకు అనుగుణంగా దూరవిద్య విధానంలో తమకు నచ్చిన కోర్సులను చేయవచ్చని, సాంప్రదాయ విద్యతో పాటు దూరవిద్య విధానంలో కూడా కోర్సులను పూర్తి చేసే అవకాశం అందుబాటులోకి రావడం సంతోషదాయకం. దూరవిద్య మన ముంగిట నిలిచింది, మనకు ఓ అద్భుతమైన అవకాశాలను తోడ్కొని వచ్చింది, వివిధ కోర్సులను మన ఇంటి గదిలో వడ్డిస్తున్నది. నేటి యువత దూర విద్యను కూడా సద్వినియోగం చేసుకొని తమ విద్యార్హతలను పెంచుకోవడం, ఆకర్షణీయమైన ఉద్యోగాలను, వేతనాలను పొందాలని కోరుకుందాం.

–డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# స్కోప్ ఎమినెన్స్ పురస్కారాలను ప్రదానం చేసిన రాష్ట్రపతి




న్యూఢిల్లీ, ఆగష్టు 30:భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ రోజు న్యూఢిల్లీలో 2022-23 సంవత్సర స్కోప్ ఎమినెన్స్ పురస్కారాలను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... దేశాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రధాన పాత్రను గుర్తించి గౌరవించడమే స్కోప్ ఎమినెన్స్ అవార్డుల ఉద్దేశమన్నారు. ఒక మంచి పరిశ్రమగా పేరు రావాలంటే సామాజిక, ఆర్థిక, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక, నైతిక ప్రమాణాలకు అనుగుణంగా చక్కని పనితీరును కనబరచాలని ఆమె సూచించారు. నిలకడైన అభివృద్ధి, కార్పొరేట్ పరిపాలన, కార్పొరేట్ సామాజిక బాధ్యతలతో పాటు నవకల్పన వంటి అనేక కోణాల్లో మంచి పనితీరును చాటిన సంస్థలను సత్కరిస్తున్నందుకు 'స్కోప్'ను రాష్ట్రపతి ప్రశంసించారు. ఇది ప్రగతి సాధన దిశగా అనుసరిస్తున్న సమగ్ర వైఖరికి సూచికగా ఆమె వ్యాఖ్యానించారు.

స్వాతంత్ర్యం తరువాతి కాలంలో ఆర్థిక అభివృద్ధికీ, సమాజంలోని అన్ని వర్గాలవారినీ కలుపుకొని ముందుకు పోవడానికీ ప్రభుత్వ రంగం ఒక బలమైన వేదికగా నిలుస్తోందని రాష్ట్రపతి ఉద్ఘాటించారు. పారిశ్రామికీకరణకూ, మౌలిక సదుపాయాల కల్పనకూ, సామాజిక అభ్యున్నతితో పాటు దేశంలోని ప్రాంతాలన్నీ సమానంగా అభివృద్ధిపథంలో సాగడానికీ పునాది వేసింది ప్రభుత్వ రంగ పరిశ్రమలేనని ఆమె అన్నారు. మారే కాలంతో ఈ పరిశ్రమలు కూడా మారుతున్నాయని శ్రీమతి ముర్ము చెప్పారు.

ప్రభుత్వ రంగ పరిశ్రమలపై ప్రభుత్వం, సమాజం పెట్టుకున్న ఆశలు కూడా కాలానుగుణంగా మారాయని తెలిపారు. ఈ మార్పుల మధ్య, ప్రభుత్వ రంగ పరిశ్రమలు తమ పనితీరుతో ఆర్థిక, జాతీయ లక్ష్యాలను సాధించడంలో ముఖ్య పాత్రను పోషిస్తుండడం చూస్తే తనకు సంతోషంగా ఉందని రాష్ట్రపతి అన్నారు.

ఆర్థికంగానూ, ద్రవ్యపరంగానూ సేవలను అందించడంతో పాటు సమతౌల్య, సమ్మిళిత వృద్ధికి ప్రభుత్వ రంగ పరిశ్రమలు పెద్ద పీట వేశాయని, జాతీయ లక్ష్యాలను సాధించడానికే మిగతా అన్నింటి కన్నా అత్యధిక ప్రాధాన్యాన్ని కట్టబెట్టాయని రాష్ట్రపతి స్పష్టం చేశారు. అవి పోషించిన పాత్ర, అందించిన సేవలను గమనిస్తే, దేశ సమృద్ధికి మూలస్తంభాలుగా, వృద్ధికి ఉత్ప్రేరకంగా నిలిచాయని చెప్పడం సముచితంగా ఉంటుందని ఆమె కితాబిచ్చారు. పరిపాలనకు, పారదర్శకత్వానికీ ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఉదాహరణలుగా ఉంటూ, అనేక మంచి నమూనాలను ఆవిష్కరించాయని రాష్ట్రపతి అన్నారు.

'స్వయంసమృద్ధ భారత్', 'భారత్‌లో తయారీ' వంటి జాతీయ ప్రచార కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలు (సీపీఎస్ఈలు) దీటైన పాత్రను పోషిస్తున్నాయని రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టినప్పుడు, దేశీయంగా రూపొందించిన ఎయిర్ డిఫెన్స్ కంట్రోల్ అండ్ రిపోర్టింగ్ వ్యవస్థ.. 'ఆకాశ్‌తీర్'.. తన అమోఘమైన సామర్థ్యాన్ని నిరూపించిందని ప్రశంసించారు. ఈ వ్యవస్థను రూపొందించడంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల పాత్ర ఎంతయినా ఉందని ఆమె కొనియాడారు. ఇది ప్రత్యేకించి ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటికీ గర్వకారణమని ఆమె అన్నారు.

స్వావలంబనతో కూడిన నవకల్పన, సాంకేతికత పరంగా స్వయం సమృద్ధి సాధన అనేవి ఊతంగా తీసుకొని ప్రభుత్వ రంగ పరిశ్రమలు అందించిన తోడ్పాటు దేశ భద్రతా పరిరక్షణలో రుజువైందని రాష్ట్రపతి అన్నారు. వ్యవసాయం, గనుల తవ్వకం, నిక్షేపాల అన్వేషణ, తయారీ, ప్రాసెసింగ్, జనరేషన్, సేవలు వంటి ప్రధాన రంగాల్లో పబ్లిక్ సెక్టర్ ఎంటర్‌ప్రైజెస్ పోషించిన పాత్ర చాలా ముఖ్యమైంది. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలోనూ ఈ పరిశ్రమలు దారి చూపే పాత్రను పోషిస్తున్నాయని ఆమె వివరించారు. 2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్‌ను ఆవిష్కరించాలన్న జాతీయ లక్ష్యాన్ని సాధించడంలో సీపీఎస్ఈలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె స్పష్టం చేశారు.

సీపీఎస్ఈలు దేశ నిర్మాణానికే అంకితమై తమ అన్ని నిర్ణయాలనూ తీసుకొంటాయని, ఈ నిర్ణయాలకు నైతిక పునాది ఉంటుందనీ, వీటి ఆలోచనల్లో సమాజ సేవ, వివేచనల స్ఫూర్తి తొణికిసలాడుతుందని ఆశిస్తున్నట్లు రాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ రంగ పరిశ్రమల అసాధారణ విజయాలను, అవి అందిస్తున్న సేవలను గుర్తించేందుకు స్టాండింగ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఎస్‌సీఓపీఈ..'స్కోప్') ఏర్పాటు చేసినవే స్కోప్ ఎమినెన్స్ పురస్కారాలు.

## జాతీయ క్రీడా దినోత్సవం.. శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి... మేజర్ ధ్యాన్ చంద్‌కు నివాళి

న్యూఢిల్లీ, ఆగష్టు 30:హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్‌ను తలుచుకొని గౌరవించుకొనే ఉద్దేశంతో ఏటా ఆగస్టు 29ని జాతీయ క్రీడా దినోత్సవంగా దేశ ప్రజలు పాటిస్తున్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారత క్రీడారంగ ముఖచిత్రంలో నిరంతరంగా చోటుచేసుకొంటున్న మార్పులను ఆయన ప్రస్తావిస్తూ, క్రీడలతో పాటు దేహ దారుఢ్య సంస్కృతిని పెంపొందించడానికి ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తోందని పునరుద్ఘాటించారు. క్రీడాకారులకు సంస్థాపరమైన మద్దతును బలోపేతం చేస్తామనీ, దేశం నలుమూలల ఆధునిక శిక్షణ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా ఆటల పోటీల నిర్వహణకు అనువైన మైదానాలను కూడా ఏర్పాటు చేస్తామనీ ఆయన స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధానమంత్రి నమోదు చేస్తూ ఇలా పేర్కొన్నారు:

"జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. ఈ విశిష్టత సందర్భంగా, మనం మేజర్ ధ్యాన్ చంద్ జీకి నివాళులు అర్పిస్తాం.. ఆయన కనబరిచిన ప్రతిభ తరాల తరబడి స్ఫూర్తిని అందిస్తోంది.

గత పది సంవత్సరాల్లో, భారత క్రీడారంగ ముఖచిత్రం అసాధారణ మార్పులకు లోనైంది. క్షేత్ర స్థాయి కార్యక్రమాలు యువ ప్రతిభావంతులకు ప్రోత్సాహకరంగా ఉండడం మొదలు ప్రపంచ స్థాయి సదుపాయాలను కల్పించడం వరకు, మనం మన దేశంలో హుషారైన క్రీడా రంగ అనుబంధ విస్తారిత వ్యవస్థ పరిఢవిల్లడాన్ని మనం గమనిస్తున్నాం. క్రీడాకారులకు సాయపడడానికీ, మౌలిక సదుపాయాలను సమకూర్చడం తో పాటు క్రీడల పరంగా శ్రేష్ఠత్వానికి ప్రపంచ కూడలిగా ఇండియాను తీర్చిదిద్దడానికీ మా ప్రభుత్వం కట్టుబడి ఉంది."

# భూక్యా బాలునాయక్ కుటుంబాన్ని పరామర్శించిన ఎర్రబెల్లి దయాకర్ రావు



పర్వతగిరి, ఆగష్టు 30: యూరియా దొరక్కపోవడంతో ఏడెకరాల్లో పత్తి చేను పీకేసి నిరసన తెలిపిన వరంగల్ జిల్లా ఉట్టి తండాకు చెందిన రైతు భూక్యా బాలునాయక్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. శనివారం ఉదయం పర్వతగిరి మండలం ఏపీ తండా శివారులోని ఉట్టి తండాకు చేరుకున్న ఎర్రబెల్లి.. పత్తి పంటను పీకేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. రైతు బాలు నాయక్ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వెంటనే రైతాంగానికి యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించాలన్నారు.

### అసలేం జరిగిందంటే..

రైతు ఏడ్చిన రాజ్యం.. ఎద్దు ఏడ్చిన ఎవుసం.. బాగుపడ్డట్టు చరిత్రలో లేదనేది అక్షర సత్యం. కానీ, తన పాలనలో రైతులను అరిగోస పెడుతూ కాంగ్రెస్ పాలకులు ఆ నానుడిని నిజం చేస్తున్నారనేది నేటి నిజం.

యూరియా సరఫరాలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంపై భూక్యా బాలునాయక్ కుటుంబంతో కలిసి వినూత్న నిరసన తెలిపాడు. యూరియా దొరకక విసుగుచెందిన బాలునాయక్ ఏడెకరాలలోని పత్తి చేనును పీకేశాడు. కాంగ్రెస్ పాలనతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశాడు. యూరియా దొరక్క పంటలను ఎలా కాపాడుకోవాలో అర్థంగాక కడుపుమండి పత్తి చేనును పీకేసినట్టు రైతు బాలు కన్నీటి పర్యంతమయ్యాడు. గతంలో సీఎం కేసీఆర్ సారు రైతాంగానికి అన్ని విధాలుగా అండగా నిలిచారని గుర్తుచేశారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి రైతుల కంట కన్నీటికి కారణమయ్యాడని, దగా చేశాడని మండిపడ్డారు. బాలునాయక్ కుటుంబం నిరసన విషయం తెలిసిన బీఆర్ఎస్ నాయకులు వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు.

# నెల రోజులైనా యూరియా ఇవ్వరా.. రంగంపేటలో రైతాగ్రహం



మెదక్, ఆగష్టు 30: నెల రోజులుగా తిరుగుతున్న యూరియా ఇవ్వడం లేదని, పంటలు దక్కేది ఎట్లా అంటూ రైతులు రాస్తారోకో చేశారు. ప్రభుత్వం వెంటనే యూరియా సరఫరా చేయాలంటూ కొల్చారం మండలంలోని రంగంపేటలో రైతులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 30 రోజులుగా ప్రతిరోజు రంగంపేట సొసైటీకి రావడం, ఆధార్ కార్డు జిరాక్సులు క్యూ లైన్‌లో ఉంచడం.. చివరకు ఉత్త చేతులతో ఇంటికి వెళ్లడం జరుగుతుందన్నారు. అధికారులేమో ఏరోజుకారోజు రేపు వస్తుందని చెబుతూ వస్తున్నారని, నెల గడిచినా యూరియా వస్తలేదన్నారు. కాలం దాటిపోయాక యూరియా వచ్చినా పంటలు చేతికి రావని, సరైన దిగుబడి లేక నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రైతులు యూరియా కావాల్సిందేనని వ్యవసాయ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఏవో ఆదివారం తప్పకుండా రెండు లారీల యూరియా తెప్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

# భారత్- జపాన్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొన్న ప్రధాని

న్యూఢిల్లీ, ఆగష్టు 30:భారత పరిశ్రమల సమాఖ్య, కీడాన్రెన్ (జపాన్ వాణిజ్య సమాఖ్య) టోక్యోలో 2025 ఆగస్టు 29న నిర్వహించిన భారత్ – జపాన్ ఎకనామిక్ ఫోరంలో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, జపాన్ ప్రధానమంత్రి శ్రీ షిగేరు ఇషిబా పాల్గొన్నారు. భారత్ –జపాన్ వాణిజ్యాధినేతల ఫోరం సీఈవోలు సహా భారత్, జపాన్ నుంచి పారిశ్రామిక ప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భారత్ – జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, అంతర్జాతీయ భాగస్వామ్యాన్నీ.. ముఖ్యంగా పెట్టుబడులు, తయారీ, సాంకేతికత రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని ప్రధానమంత్రి తన ప్రసంగంలో వివరించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని జపాన్ కంపెనీలను ఆహ్వానించారు. విజయవంతంగా సాగుతున్న భారత అభివృద్ధి ప్రస్థానంలో వారికి అనేక ఉత్తేజకరమైన అవకాశాలు ఉంటాయన్నారు. ప్రస్తుత కల్లోల ప్రపంచ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విశ్వసనీయ మిత్రుల మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడం అత్యావశ్యకమని ఆయన పేర్కొన్నారు. రాజకీయ సుస్థిరత, విధాన అంచనా, సంస్కరణల పట్ల నిబద్ధత, వాణిజ్య సౌలభ్య చర్యలు భారత మార్కెట్‌పట్ల పెట్టుబడిదారుల్లో సరికొత్త నమ్మకాన్ని కల్పించాయని, అంతర్జాతీయ సంస్థలు తాజాగా భారత క్రెడిట్ రేటింగ్ ను పెంచడాన్ని బట్టి ఇది స్పష్టమవుతోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, తయారీ, పెట్టుబడులు, భారత్ – జపాన్ మధ్య మానవ వనరుల వినిమయంలో సహకారం ఆవశ్యకతను ప్రత్యేకంగా వివరిస్తూ... అంతర్జాతీయ వృద్ధిలో భారత్ వాటా దాదాపు 18 శాతంగా ఉందని, మరి కొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తోందని భారత ప్రధానమంత్రి తెలిపారు. రెండు ఆర్థిక వ్యవస్థల అనుబంధం దృష్ట్యా.. మేకిన్ ఇండియా, ఇతర కార్యక్రమాల దిశగా అయిదు కీలక రంగాల్లో భారత్ – జపాన్ మధ్య వాణిజ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆయన పేర్కొన్నారు. అవి: తయారీ – బ్యాటరీలు, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, నౌకా నిర్మాణం, అణు ఇంధన రంగాల్లో, కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, అంతరిక్షం, బయోటెక్ సహా సాంకేతికత, ఆవిష్కరణల్లో సహకారం, పర్యావరణ హిత ఇంధనం దిశగా పరివర్తన, రవాణా, హైస్పీడ్ రైలు అనుబంధ వ్యవస్థలు సహా సమగ్ర మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ప్రజా సంబంధాలు.

జపాన్ ప్రధానమంత్రి శ్రీ ఇషిబా మాట్లాడుతూ.. భారత ప్రతిభ, జపాన్ సాంకేతికత మధ్య భాగస్వామ్యం ద్వారా అంతరాయాల్లేని సరఫరా వ్యవస్థను నెలకొల్పడానికి జపాన్ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయని పేర్కొన్నారు. భారత్, జపాన్ మధ్య మూడు ప్రాధాన్యాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రత్యక్ష భాగస్వామ్యాల బలోపేతం, సాంకేతికత – పర్యావరణ హిత కార్యక్రమాలు – మార్కెట్ సమ్మేళనం, అత్యున్నత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ముఖ్యంగా సెమీ కండక్టర్ వంటి కీలక రంగాల్లో సహకారం.

12వ భారత్ – జపాన్ వాణిజ్యాధినేతల ఫోరం (ఐజేబీఎల్ఎఫ్) నివేదికను ఐజేబీఎల్ఎఫ్ సహాధ్యక్షులు ప్రధానులిద్దరికీ అందజేశారు. భారత్ – జపాన్ మధ్య పెరుగుతున్న పారిశ్రామిక భాగస్వామ్యాలను వివరిస్తూ... ఉక్కు, కృత్రిమ మేధ, అంతరిక్షం, విద్య, నైపుణ్యాలు, పర్యావరణ హిత ఇంధనం, మానవ వనరుల వినిమయం వంటి వివిధ రంగాల్లో భారత్ – జపాన్ కంపెనీల మధ్య కుదిరిన వివిధ పారిశ్రామిక అవగాహన ఒప్పందాలను జపాన్ విదేశీ వాణిజ్య సంస్థ (జెట్రో) చైర్మన్, సీఈవో శ్రీ నొరిహికో ఇషిగురో ప్రకటించారు.

## మాగంటి గోపీనాథ్ క్రమశిక్షణ కలిగిన నాయకుడు - కేపీ వివేకానంద

హైదరాబాద్, ఆగష్టు 30:జూబ్లీ హిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చాలా క్రమశిక్షణ కలిగిన నాయకుడు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ పేర్కొన్నారు. శాసనసభలో మాగంటి గోపీనాథ్ సంతాప తీర్మానం సందర్భంగా కేపీ వివేకానంద మాట్లాడారు.

మాగంటి గోపీనాథ్ క్రమశిక్షణ కలిగిన నాయకుడే కాదు.. ఆదర్శ నాయకుడు కూడా. వారు చిన్న వయసు నుంచే రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్నారు. నిబద్ధతతో ప్రజా సేవ చేశారు. చిత్తశుద్ధితో రాజకీయాలు చేశారు. 1983 నుంచి 2014 వరకు వేచి చూశారు.. ఓపీకతో ఉన్నారు. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికై.. వరుసగా మూడు సార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. రాజకీయంగా నన్ను ప్రోత్సహించేవారు. గోపీనాథ్ మరణం బాధాకరం. వయసులో ఆయన పెద్ద వారైనా.. తనను ఒక సోదరుడిగా, స్నేహితుడి లాగా చూసుకునేవారు. స్నేహానికి విలువ ఇచ్చేవారు గోపీనాథ్ అని కేపీ వివేకానంద గుర్తు చేశారు.

హైదరాబాద్ నగరంలో అనేక సమస్యలను పరిష్కరించడంలో జట్టుగా పని చేశాం. గోపీనాథ్ మమ్మల్ని ముందుకు నడిపించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఆయన పాత్ర ఉంది. వారు సొంత ఖర్చులతో కొన్ని పనులు నిర్వహించారు.

# షూ నుంచి విచిత్ర శబ్దం.. కదిలించగా షాక్..

సంగారెడ్డి, ఆగష్టు 30: వర్షాకాలం వచ్చింది అంటే.. పాములు, కీటకాల బెడద ఎక్కువ ఉంటుంది. అందుకోసమే.. తగు జాగ్రత్తలు తీసుకుంటూ.. ఇంటి పరిసరాలు, తిరిగే చోట్లు అన్ని శుభ్రం చేసుకుంటాం. ఎంత శుభ్రం చేసుకున్న ఇంటి పరిసరాల్లో అడపదడప పాములు, కీటకాలు కనపడుతూనే ఉంటాయి. అదే గ్రామాల్లో అయితే చెప్పాల్సిన పనేలేదు. గ్రామాల్లో మాదిరిగానే.. జిల్లాలోని ఓ బీఎస్సీ నర్సింగ్ హాస్టల్‌లో పాములు ప్రత్యక్షం అవుతున్నాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

ఓ విద్యార్థిని షూలో పాము ప్రత్యక్షమైన సంఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లాకు చెందిన ఓ యువతి సంగారెడ్డిలోని బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో చదువుతోంది. ఎప్పటిలాగే కళాశాలకు వెళ్లేందుకు హాస్టల్ వద్ద ఆ విద్యార్థిని షూ వేసుకుంటుండగా.. అందులో పాము కనిపించింది. దాంతో ఆమె ఒక్కసారిగా భయాందోళనకు గురై షూను.. దూరంగా విసిరేసింది. కొద్దిసేపటికి పాము షూ నుంచి బయటకు రాగా.. స్థానికులు కర్రతో కొట్టి చంపారు. పాము షూలోకి రావడంతో హాస్టల్లో ఉన్న విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. నర్సింగ్ కళాశాల హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.

# భారత్- జపాన్ మధ్య ఖనిజ వనరుల సహకార ఒప్పందంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి ప్రకటన

న్యూఢిల్లీ, ఆగష్టు 30:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రస్తుతం జపాన్‌లో ఆ దేశ ప్రధాన మంత్రి షిగేరు ఇషిబాతో కలిసి 15వ భారత్–జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొననున్నారు. ఆర్థిక రంగం, ఆరోగ్యం, మొబిలిటీ భాగస్వామ్యం, కృత్రిమ మేధ (ఏఐ), శాస్త్ర సాంకేతిక, కీలక, అరుదైన ఖనిజాలు వంటి బహుళ రంగాలలో సహకారానికి రెండు దేశాల ప్రధానులు అంగీకరించారు.

ఖనిజ వనరుల రంగానికి సంబంధించి జపాన్ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖతో భారత ఖనిజ శాఖ సహకార ఒప్పందం కుదుర్చుకుంది. కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు, విస్తరించేందుకు భారత్ చేస్తున్న నిరంతర ప్రయత్నాల్లో భాగమైన ఈ ఒప్పందం.. దేశ ఇంధన భద్రత, జాతీయ భద్రత, ఆహార భద్రతా లక్ష్యాలను చేరుకోవడం తో పాటు నికర శూన్య ఉద్గార లక్ష్యాలను సాధించడానికి కూడా సహాయపడుతుంది. సన్నిహిత సహకారం కోసం ఈకింది రంగాలను ఎంపిక చేసుకున్నారు. ఖనిజ వనరులపై సమాచార మార్పిడి, విధానాలు, నిబంధనలు, కీలక ఖనిజ ప్రాజెక్టుల ఉమ్మడి అభివృద్ధి, మైనింగ్ వేలం, స్థిరమైన సముద్ర గర్భ మైనింగ్, ఖనిజా వెలికితీత, పరిశీలన, కీలకమైన ఖనిజాల నిల్వ ప్రయత్నాలు మొదలైన అంశాలపై సమాచారాన్నిపంచుకోవడంభారత్‌తో సహా వనరులు అధికంగా ఉన్న దేశాలలో కీలక ఖనిజాల కోసం అన్వేషణ, మైనింగ్, ప్రాసెసింగ్‌లో ఉమ్మడి పెట్టుబడులను ప్రోత్సహించడం.

# అరుదైన నాయకుడు మాగంటి గోపీనాథ్ : ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 30:జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ రాజకీయాల్లో అరుదైన నాయకుడు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కొనియాడారు. అసెంబ్లీలో మాగంటి గోపీనాథ్ సంతాప తీర్మానం సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడారు.

మాగంటి గోపీనాథ్ మన మధ్య లేకపోవడం చాలా బాధకరం. వారు, నేను ఒకేసారి 2014లో ఈ సభలోకి అడుగుపెట్టాం. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఈ సభలో వారితో కలిసి పని చేశాం. వారు చాలా మృదుస్వభావి. వివాదాలకు దూరంగా ఉండేవారు. 35 ఏండ్ల క్రితం మాగంటి గోపీనాథ్ నాకు పరిచయం. మా కుటుంబం, మా తండ్రి టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. అప్పట్నుంచి గోపీనాథ్‌తో సంబంధాలు ఉన్నాయని ప్రశాంత్ రెడ్డి గుర్తు చేశారు.

గోపీనాథ్ ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీకి నమ్మకంగా పని చేసేవారు. పార్టీ నాయకుడికి విధేయుడిగా ఉన్నారు. ఎన్టీఆర్, కేసీఆర్‌కు నమ్మకంగా పని చేశారు. ఒక రాజకీయ నాయకుడికి నిబద్ధతతో పని చేయడం, ప్రజలతో మంచి సంబంధాలు ఏర్పడరుచుకోవడం ముఖ్యం. కానీ ఈ రెండు లక్షణాలు చాలా మంది నాయకులకు ఉండవు. ఈ రెండు లక్షణాలు కొందరిలోనే ఉంటాయి.. అలాంటి అరుదైన వ్యక్తుల్లో గోపీనాథ్ ఒకరు. అధికారంలో ఉన్నా లేకపోయినా ఎన్టీఆర్‌తో అంటిపెట్టుకుని ఉన్న నాయకుల్లో గోపీ ఒకరు. అధికారం కోల్పోయిన తర్వాత ఎన్టీఆర్ నాచారం స్టూడియోలో ఉండేవారు. చాలా తక్కువ మంది అక్కడికి వెళ్లేవారు. గోపీతో పాటు కొంత మంది ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లేవారు. ఆ రోజుల్లో కలిసి ఉన్న వ్యక్తులం, ఆలోచనలు పంచుకున్న వ్యక్తులం. అధికారం కోల్పోయిన తర్వాత కూడా బీఆర్ఎస్ పార్టీకి నిబద్ధతగా పని చేశారు. ఆ విధంగానే జూబ్లీహిల్స్ ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పారు. మూడుసార్లు గెలవడం అంటే అంత ఈజీ కాదు. ప్రజా నాయకుడిగా నిలదొక్కుకున్నారు. ఆయన చిరస్మరణీయుడు. ఆయన లేని లోటును నియోజకవర్గ ప్రజలకు తీర్చే విధంగా పార్టీ అండగా ఉంటుంది. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం పరుస్తున్నాం అని వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

# గోనె సంచుల వినియోగ చార్జీలను దాదాపు 40 శాతం వరకు పెంచిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఆగష్టు 30:గోనె సంచుల వినియోగ చార్జీలను దాదాపు 40 శాతం వరకు పెంచుతూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలకు ఆర్థిక ఉపశమనం కలుగుతుందని కేంద్ర వినియోగ దారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ఈరోజు పేర్కొన్నారు.

ఆహార ధాన్యాల సేకరణ, పంపిణీలో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సహకారాన్ని మరింత బలోపేతం చేస్తూ.. సుస్థిర ప్యాకేజింగ్ పద్ధతులకు మద్దతునిస్తూ.. సేకరణ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటం ఈ నిర్ణయం లక్ష్యమని ఆయన తెలిపారు.

వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి కేంద్రానికి ఈ సవరణ కోసం పలు అభ్యర్థనలు అందాయి. భారత ప్రభుత్వ ఆహార, ప్రజా పంపిణీ శాఖ దీని కోసం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్యాకేజింగ్ ఛార్జీల సమగ్ర సమీక్ష కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)ల ప్రతినిధులతో ఈ కమిటీని ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు కమిటీకి పలు సూచనలు అందించాయి.

కమిటీ సిఫార్సుల ఆధారంగా ఉపయోగించిన ప్రతి సంచీకి రూ. 7.32 నుంచి రూ. 10.22 వరకు గానీ.. రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాలు చేసిన వాస్తవ ఖర్చు గానీ.. వీటిలో ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని వినియోగ చార్జీగా భారత ప్రభుత్వం నిర్ణయించింది. కేఎమ్ఎస్ 2017–18 నుంచి కేఎమ్ఎస్ 2024–25 వరకు పెరిగిన కొత్త గన్నీ సంచుల ధరకు అనుగుణంగా ఉపయోగించిన గోనె సంచుల వినియోగ చార్జీలను పెంచారు. సవరించిన రేటు కేఎమ్ఎస్ 2025–26 నుంచి వర్తిస్తుంది.

# గాలి మోటార్ల మీద తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్న సీఎం: బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 30: సీఎం రేవంత్ రెడ్డి గాలి మోటర్‌లో తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల పెద్దఎత్తున పంట నష్టం జరిగిందని చెప్పారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులను కాపాడాలన్న కనీస ఇంకిత జ్ఞానం ముంఖ్యమంత్రికి లేదన్నారు. వేలాది ఎకరాల్ల పంట నష్టం, ప్రాణ నష్టం జరిగిందని, రైతులు నష్ట పోయారని చెప్పారు. ముఖ్యమంత్రికి ఏమాత్రం సోయి లేకుండా అందాల పోటీల మీద, మూసీ నదిపై రివ్యూలు నిర్వహిస్తూ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అసెంబ్లీలో చర్చకు రావాల్సిన అనేక సమస్యలు ఉన్నాయని, మూడు రోజులు మాత్రమే సభను నడపాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలన్నారు. సీఎం చర్చలకు భయపడుతున్నారా అని ప్రశ్నించారు. భేషరతుగా 4 వారాలపాటు అసెంబ్లీ నిర్వహించాలని, ముఖ్యమంత్రికి దమ్ము, ధైర్యం లేక తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు.

# రోడ్డు ప్రమాదంలో చిరుతపులి మృతి.. పోస్టుమార్టమ్ నిర్వహిస్తున్న అధికారులు

న్యూఢిల్లీ, ఆగష్టు 30:రోడ్డు ప్రమాదంలో ఆడ చిరుతపులి మృతిచెందింది. దాని వయసు సుమారు రెండు నుంచి రెండున్నర ఏళ్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. గురుగ్రామ్–ఫరీదాబాద్ రోడ్డు మార్గంలో ఉన్న ఆరావలి ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. స్థానిక ఎన్జీవో వన్యప్రాణి అధికారుల్ని అలర్ట్ చేసింది. ప్రమాద ప్రాంతానికి చేరుకున్న అధికారులు ఆ చిరుతను కస్టడీలోకి తీసుకుని పోస్టుమార్టమ్ నిర్వహిస్తున్నారు. బహుశా ఇది హిట్ అండ్ రన్ కేసు అయి ఉంటుందని వైల్డ్‌లైఫ్ ఆఫీసర్ ఆర్కే జాంగ్రా తెలిపారు. పోస్టమార్టమ్ నిర్వహిస్తున్నామని, అతివేగంగా ప్రయాణించే వాహనాలతో ఈ ప్రాంతంలో సమస్యలు వస్తున్నట్లు ఆయన చెప్పారు.

గురుగ్రామ్–ఫరీదాబాద్ మార్గంలో ఉన్న అసోలా భాటి వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, అరావలి పర్వతాల మధ్య తరుచుగా చిరుతపులులు సంచరిస్తూ ఉంటాయి. అయితే ఈ ప్రాంతంలో ప్రమాదాలు కూడా అధికంగా అవుతున్నట్లు గుర్తించారు. గురుగ్రామ్ సమీపంలోని ఆరావలి కొండల్లో సుమారు 50 చిరుత పులులు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో అవి తరుచూ కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో కూడా ఇదే మార్గంలో రోడ్డు ప్రమాదానికి ఓ చిరుత బలైనట్లు పేర్కొన్నారు.

# అధిక స్థాయి వైద్య పరికరాలలో స్వావలంబన వైపు భారతదేశం ప్రధాన అడుగులు వేస్తోంది




న్యూఢిల్లీ, ఆగష్టు 30:న్యూఢిల్లీలో జరిగిన "ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఆవిష్కరణలు – గ్లోబల్ ఇంపాక్ట్ కోసం మెడ్‌టెక్‌ను అభివృద్ధి చేయడం: ఇండియాలో తయారు చేయండి, ప్రపంచం కోసం తయారు చేయండి'' అనే ఇతివృత్తంతో జరిగిన 17వ అఎఐ గ్లోబల్ మెడ్‌టెక్ సమ్మిట్‌లో ఫార్మాస్యూటికల్స్ విభాగం కార్యదర్శి శ్రీ అమిత్ అగర్వాల్ వైద్య సాంకేతికతకు అభివృద్ధి చెందుతున్న కేంద్రంగా భారతదేశం పరివర్తన చెందడాన్ని హైలైట్ చేశారు.

ప్రారంభ సమావేశంలో వైద్య సాంకేతిక భాగస్వాములను ఉద్దేశించి శ్రీ అగర్వాల్ మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద జనాభాకు నిలయంగా మరియు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు నిలయంగా ఉండటంతో, సరసమైన మరియు వినూత్నమైన ఆరోగ్య సంరక్షణ పరిష్కారాల కోసం దేశీయ డిమాండ్ రాబోయే దశాబ్దాలలో రెండంకెల వృద్ధి రేటుతో స్థిరంగా పెరుగుతుందని అన్నారు. మెడ్‌టెక్ రంగం యొక్క ప్రధాన లక్ష్యం రోగుల శ్రేయస్సు మరియు దేశీయ మరియు ప్రపంచ మార్కెట్ల కోసం అధిక–నాణ్యత, ఖర్చుతో కూడుకున్న వైద్య పరికరాలను అభివృద్ధి చేయడంపై కేంద్రీకృతమై ఉండాలని ఆయన నొక్కి చెప్పారు.

కోవిడ్ తర్వాత, భారతదేశం ఓఖీఎ మరియు అు స్కాన్ యంత్రాలు, మామోగ్రఫీ యూనిట్లు, వెంటిలేటర్లు, స్టెంట్లు, హార్ట్ వాల్వ్‌లు, డయాలసిస్ యంత్రాలు మరియు వివిధ రకాల ఇంప్లాంట్ పరికరాలతో సహా అధునాతన పరికరాల దేశీయ తయారీలో ఒక ముఖ్యమైన మైలురాయిని విజయవంతంగా దాటిందని శ్రీ అగర్వాల్ పేర్కొన్నారు. ఆయన ఇలా అన్నారు: "ఒక దశాబ్దం క్రితం స్థానిక ఉత్పత్తికి అసాధ్యం అనిపించిన ఉత్పత్తులు ఇప్పుడు భారతదేశంలో తయారు చేయబడుతున్నాయి, ఇది దేశం యొక్క పెరుగుతున్న సామర్థ్యాలను మరియు ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను ప్రదర్శిస్తుంది."

ఈ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును కార్యదర్శి ప్రస్తావిస్తూ, రాబోయే సంవత్సరంలో పనిచేయనున్న మూడు ప్రత్యేక వైద్య పరికరాల పార్కులు, వాటి నిరంతర మౌలిక సదుపాయాల అప్‌గ్రేడ్‌కు ప్రణాళిక చేయబడిన మద్దతు మరియు వైద్య పరికరాల కోసం ఉత్పత్తి లింక్డ్ ఇన్సెంటివ్ పథకం పరిశ్రమను ముందుకు నడిపించే ప్రధాన విధాన దశలుగా పేర్కొన్నారు. ప్రయోగశాల నుండి మార్కెట్‌కు కొత్త ఆలోచనల ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి, తద్వారా భారతదేశం యొక్క ప్రపంచ పోటీతత్వాన్ని బలోపేతం చేయడానికి ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులు మరియు పెట్టుబడిదారుల మధ్య లోతైన సహకారం కోసం శ్రీ అగర్వాల్ పిలుపునిచ్చారు.

వైద్య పరికరాల పార్క్ సౌకర్యాలను విస్తరించడం, పిఎల్ఐపథకం మరియు వెనుకబడిన ఇంటిగ్రేషన్ కోసం మార్జినల్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ వంటి లక్ష్య విధాన కార్యక్రమాలు మరియు త్వరలో ప్రారంభించబోయే 5,000 కోట్ల ఫార్మా మెడ్‌టెక్ రంగంలో పరిశోధన మరియు ఆవిష్కరణల ప్రోత్సాహకం పథకం ఫలితంగా భారతీయ మెడ్‌టెక్ రంగం యొక్క ఖర్చు – పోటీతత్వం మరియు ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది, దేశీయ విలువ గొలుసును మరింతగా పెంచుతుంది మరియు బలమైన ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుంది. ఇవి భారతదేశం తన స్వంత అవసరాలను తీర్చడమే కాకుండా ప్రపంచ ఉత్తర మరియు దక్షిణ ప్రాంతాలకు సరసమైన వినూత్న ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అందించడానికి వీలు కల్పిస్తాయని కార్యదర్శి చెప్పారు.

"ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ఇప్పుడు భారతదేశాన్ని మార్కెట్‌గా మాత్రమే కాకుండా, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలలో అగ్రగామిగా చూస్తున్నాయి. మెడ్‌టెక్ రంగం యొక్క పూర్తి సామర్థ్యాన్ని గ్రహించడానికి మనం మన స్వంత సామర్థ్యాలను విశ్వసించాలి మరియు పరిశ్రమ –ప్రభుత్వ భాగస్వామ్యాన్ని తీవ్రతరం చేయాలి" అని శ్రీ అగర్వాల్ అన్నారు. కొనసాగుతున్న ఆర్థిక సంస్కరణలు మరియు అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలతో, ఈ రంగం లక్షలాది కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని, అందరికీ అందుబాటులో ఉండే, అధిక–నాణ్యత గల ఆరోగ్య సంరక్షణను నిర్ధారించడంలో సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.

భారతదేశం యొక్క మెడ్‌టెక్ దార్శనికతను రూపొందించడంలో సహకరించాలని అన్ని వాటాదారులను ఆహ్వానించడం ద్వారా ఆయన ముగించారు మరియు భారతదేశం యొక్క విక్సిత్ భారత్ 2047 దార్శనికతను సాకారం చేసుకోవడానికి అన్ని వాటాదారుల భాగస్వామ్యంతో విలువ గొలుసు అంతటా సహకార మరియు సంఘటిత ప్రయత్నాలకు పిలుపునిచ్చారు.

# భారత్-జపాన్ మానవ వనరుల బదిలీలు, సహకారానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక

న్యూఢిల్లీ, ఆగష్టు 30:మానవ వనరులకు సంబంధించి భారత్, జపాన్ మధ్య 5 సంవత్సరాలలో కానున్న 5,00,000 మంది పరస్పర బదిలీల్లో 50,000 మంది నైపుణ్యం కలిగిన సిబ్బంది, ప్రతిభావంతులు ఉండనున్నారు.

భారత్–జపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశం– 2025 సందర్భంగా ఇరు దేశాల ప్రధానమంత్రులు.. సందర్శనలు, బదిలీ కార్యక్రమాల ద్వారా తమ ప్రజల మధ్య లోతైన అవగాహనను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించారు. విలువలను పెంపొందించేందుకు, సంబంధిత జాతీయ ప్రాధాన్యతలపై పనిచేసేందుకు మానవ వనరుల విషయంలో భాగస్వామ్య అవకాశాలను కనుగొనేందుకు అంగీకారానికి వచ్చారు.

దీని ప్రకారం భవిష్యత్‌లో రెండు దేశాల మధ్య వారధిగా పనిచేయడానికి మానవ వనరుల బదిలీ కార్యక్రమాలను విస్తరించడానికి భారత్, జపాన్ దేశాల ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కృషి చేయనున్నాయి. రాబోయే ఐదేళ్లలో 5,00,000 లకు పైగా సిబ్బందిని ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలనే భారీ లక్ష్యాన్ని ఇరు దేశాలు నిర్దేశించుకున్నాయి. ఇందులో 50,000 మంది నైపుణ్యం కలిగిన సిబ్బంది, ప్రతిభావంతులు ఉండనున్నారు. ఈ కార్యక్రమాలను ఈ కింది లక్ష్యాలతో చేపట్టనున్నారు:

జపాన్‌లో పనిచేయటంపై ఉన్న దృక్పథాన్ని మార్చటం ద్వారా భారత్‌కు చెందిన నైపుణ్యం కలిగిన వారిని, ప్రతిభావంతులను జపాన్ ఆకర్షించడం.

రెండు దేశాల్లో ఉమ్మడి పరిశోధన, వ్యాపారీకరణ, విలువను సృష్టించేందుకు మానవ వనరుల సామర్థ్యాలను పరస్పరం ఉపయోగించుకోవటం.

భారత్‌లో జపనీస్ భాషా విద్యను ప్రోత్సహించడం.. భవిష్యత్తు కోసం రెండు వైపుల సాంస్కృతిక, విద్యా, క్షేత్ర స్థాయి బదిలీలను ప్రోత్సహించడం.

ఐటీ సిబ్బందితో పాటుగా మానవ వనరుల కొరతను ఎదుర్కొంటున్న జపాన్.. తయారీ రంగాన్ని బలోపేతం చేయటం, నైపుణ్యాలను పెంచాలని ఆశిస్తోన్న భారత్.. ఇలా రెండు దేశాలకు ఆర్థికంగా ప్రయోజనకరమైన వాటిపై పనిచేయటం.

జపాన్ కంపెనీలు, భారతీయ విద్యార్థుల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం.

ఈ దిశగా రెండు దేశాలు సంయుక్తంగా ఈ కింది కార్యాచరణ ప్రణాళికను తీసుకొచ్చాయి. రాబోయే అయిదు సంవత్సరాల్లో భారత్ నుంచి జపాన్‌కు వెళ్లే నిపుణులు, ప్రతిభావంతుల సంఖ్యను 50,000 లకు పెంచేందుకు ప్రభుత్వం, పరిశ్రమ, వివిధ విద్యా సంస్థలు కృషి చేసేలా ఇది ప్రోత్సహించనుంది.

అధిక నైపుణ్యం కలిగిన సిబ్బంది:

రాబోయే 5 ఏళ్లలో భారతీయ ఇంజనీరింగ్ నిపుణులు, విద్యా సిబ్బంది జపాన్‌కు వెళ్లటాన్ని ఇది పెంచనుంది. వీటిపై ఇది పనిచేస్తుంది:

సెమీకండక్టర్లు, ఏఐ వంటి లక్షిత రంగాల్లో జపనీస్ కంపెనీలలో ఉన్న ఉపాధి అవకాశాల గురించి అవగాహన పెంచడమే లక్ష్యంగా భారత ఉన్నత విద్యా సంస్థలకు జపనీస్ కంపెనీల ప్రత్యేక మిషన్.

జపాన్‌లో భారతీయ నిపుణుల ఉపాధికి సంబంధించి సర్వే నిర్వహించడం, ఉత్తమ పద్ధతులు లేదా విజయ గాథలను గుర్తించడం, అవగాహనను పెంచటం, ఉపాధి పెంచే ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా ఆ దేశంలో ఎక్కువ మంది భారతీయులను ఉద్యోగాల్లో నియమించటం, భారతీయ ప్రతిభను అక్కడే నిలుపుకోవడం.

జపాన్ ఎక్స్ఛేంజ్, టీచింగ్ కార్యక్రమం (జేఈటీ) కింద జపాన్‌లో భారత్‌కు చెందిన ఆంగ్ల భాషా సహోపాధ్యాయుల ఉపాధిని ప్రోత్సహించడం.

విద్యార్థులు, పరిశోధకులు:

రాబోయే 5 సంవత్సరాలలో భారతీయ విద్యార్థులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు జపాన్‌కు వెళ్లటాన్ని పెంచటం. దీన్ని కింది వాటి ద్వారా సాధించనున్నారు:

భారత్, జపాన్ మధ్య విద్యార్థుల బదిలీలను ప్రోత్సహించటం.. జపాన్‌లో భారతీయ విద్యార్థులకు చదువుకున్న అనంతరం ఇంటర్న్‌షిప్, ఉపాధి పొందే ప్రక్రియను క్రమబద్ధీకరించే చర్యలపై దృష్టి సారిస్తూ జపాన్ ప్రభుత్వ ఎంఈఎక్స్‌టీ, భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ మధ్య విద్యపై ద్వైపాక్షిక ఉన్నత స్థాయి విధానపరమైన చర్చలు.

భారత్‌లోని భాగస్వామ్య విశ్వ విద్యాలయాలతో నాణ్యతతో కూడిన అంతర్జాతీయ విద్యార్థుల బదిలీ కార్యక్రమాలను తయారు చేసేందుకు, నిర్వహించేందుకు జపనీస్ విశ్వవిద్యాలయాలకు సహాయపడేలా ఇంటర్–యూనివర్సిటీ ఎక్స్ఛేంజ్ ప్రాజెక్టును ఎంఈఎక్స్‌టీ ప్రోత్సహిం చడం.

జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జేఎస్‌టీ) నిర్వహించే సాకురా సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కింద ప్రతి సంవత్సరం జపాన్‌కు భారతీయ విద్యార్థులు, పరిశోధకుల సందర్శనలు.. మహిళా పరిశోధకులు పాల్గొనేలా ప్రోత్సహించడం.

జపాన్‌లో చదువుతోన్న భారతీయ విద్యార్థులకు జపనీస్ ప్రభుత్వ (ఎంఈఎక్స్‌టీ) ఉపకారవేతనాల ద్వారా నిరంతర మద్దతునివ్వటం.

రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక మానవ వనరుల బదిలీలకు ఉత్ప్రేరకంగా పనిచేసేలా భారత విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను జపనీస్ కంపెనీలను సందర్శించేందుకు, నెల రోజుల పాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు.. జపాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ కొత్తగా ప్రారంభించిన మిరాయ్–సేతు కార్యక్రమం కింద ఆహ్వానించటం.

రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక శాస్త్రీయ మానవ వనరుల బదిలీకి ఉత్ప్రేరకంగా పనిచేసేందుకు భారత్, జపాన్ మంత్రిత్వ శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువ విజ్ఞాన బదిలీ కార్యక్రమం కింద శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన ఉన్నత పాఠశాల విద్యార్థులను స్వల్ప కాలిక కార్యక్రమాల కోసం జపాన్ విద్యా సంస్థలకు ఆహ్వానించటం.

అత్యాధునిక రంగాల్లో భారత్, జపాన్ సంయుక్త పరిశోధనలను ప్రోత్సహించేందుకు.. జపాన్‌కు వచ్చే పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో సహా యువ పరిశోధకుల కోసం జపాన్ ఎంఈఎక్స్‌టీ కొత్తగా తీసుకొచ్చిన లోటస్ కార్యక్రమం (ఇండియా–జపాన్ సర్క్యులేషన్ ఆఫ్ యూత్ ఇన్ సైన్స్ ప్రోగ్రామ్).

పరిశ్రమలు– విద్యా రంగం భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు జపానీస్ కంపెనీస్‌లలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారికి ఇంటర్న్‌షిప్‌ల రూపంలో సంబంధింత కంపెనీలలో అవకాశాలను జపాన్ ప్రభుత్వ ఎంఈఐటీ చూపించనుంది.

ప్రత్యేక నైపుణ్యాలున్న పనివాళ్ల (ఎస్ఎస్‌డబ్ల్యూ) వ్యవస్థ లేదా టెక్నికల్ ఇంటర్న్ నైపుణ్య శిక్షణ కార్యక్రమం (టీఐటీపీ):

జపాన్ ఎస్ఎస్‌డబ్ల్యూ వ్యవస్థ కింద 5 సంవత్సరాల వ్యవధిలో భారతీయ మానవ వనరుల ప్రవాహాన్ని మెరుగుపరచటం. దీన్ని కింది వాటి ద్వారా సాధించనున్నారు:

భారత్‌లో ఎస్ఎస్‌డబ్ల్యూ పరీక్షను మొత్తం 16 విభాగాలల్లో నిర్వహించేందుకు కృషి చేయటం.

భారత్‌లోని ఉత్తర, తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఈశాన్య ప్రాంతాల్లో నైపుణ్య పరీక్షలు, జపనీస్ భాషా పరీక్షల కోసం కొత్త పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయటం

భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) చేపడుతోన్న ప్రవాసీ కౌశల్ వికాస్ యోజన కార్యక్రమం ద్వారా అర్హత కలిగిన భారతీయ ఎస్ఎస్‌డబ్ల్యూ సిబ్బందికి జపాన్‌కు వెళ్లే కంటే ముందు వృత్తిపరమైన భాషా శిక్షణను అందించడం.

భారత ఈ–మైగ్రేట్ పోర్టల్‌లో జపాన్‌ను గమ్యస్థాన దేశంగా చేర్చడం.. ధ్రువీకరణ పొందిన భారతీయ సిబ్బందిని సురక్షితంగా, చట్టబద్ధంగా, క్రమబద్ధంగా జపాన్ సంస్థలు నియమించుకోవటం కోసం భారత కెరీర్ సర్వీస్ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేకమైన భారత్–జపాన్ కారిడాంను ఏర్పాటు చేయటం.

టీఐటీపీ, ఈఎస్‌డీ (ఎంప్లాయ్‌మెంట్ ఫర్ స్కిల్ డెవలాప్మెంట్) కార్యక్రమం ద్వారా భారతీయ ప్రతిభావంతులను జపాన్‌కు ఆకర్షించటం.

భారతదేశంలో నైపుణ్య స్థాయిలను పెంచేందుకు, జపాన్ అవసరాల కోసం సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని మరింతగా ఉత్పత్తి చేయడానికి జపాన్‌కు ఉన్న నిర్వాహక, పారిశ్రామిక, తయారీ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవటం. ఇందులో ఇవి ఉన్నాయి:

ఇండియా–నిప్పన్ ప్రోగ్రామ్ ఫర్ అప్లయిడ్ కాంపిటెన్సీ ట్రైనింగ్ (ఇన్‌పాక్ట్) లాంటి కార్యక్రమాల కింద జపాన్ కంపెనీలు భారత్‌లో అందించే కోర్సులు, వృత్తి విద్యా కోర్సులు.. జపాన్‌లో భారతీయుల నైపుణ్య శిక్షణకు సంబంధించిన ఖర్చుకు సబ్సిడీని అందించటం

కొత్తగా ప్రారంభించిన "ఇండియా–జపాన్ టాలెంట్ బ్రిడ్జ్", ఇతర కార్యక్రమాల ద్వారా భారతీయ విద్యార్థులు, ఉద్యోగం చేస్తోన్న నైపుణ్యం కలిగిన భారతీయ నిపుణుల కోసం ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలు, ఉద్యోగ కల్పన కార్యక్రమాలను ప్రోత్సహించడం.

రాష్ట్రంలోని ప్రజలకు జపాన్‌లో ఉపాధి కల్పించేందుకు సంబంధింత శిక్షణ, నియామకాల విషయంలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయటం

సహజ ఆరోగ్యంపై అవగాహనను పెంచేందుకు, వీటి అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి, ముఖ్యంగా వృద్ధాప్య సంరక్షణ రంగంలో వీటి అమలును ప్రోత్సహించేందుకు.. జపాన్ అంతటా భారత రాయబార కార్యాలయం, భారత ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన ఆయుష్ సెల్ పర్యవేక్షణలో యోగా, ఆయుర్వేదంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయడం

భాషా సామర్థ్య అభివృద్ధి:

వీటి ద్వారా నైపుణ్య రంగాలకు సంబంధించిన జపనీస్ భాషా విద్యను ప్రోత్సహించడం:

ప్రభుత్వ, ప్రైవేట్ రంగ కార్యక్రమాల ద్వారా భారత్‌లోని విద్యా సంస్థల్లో ఆచరణాత్మక జపనీస్ భాషా బోధనకు అందుబాటులో ఉంచటం.

జపనీస్ కంపెనీలు అందించే భాషా శిక్షణ విషయంలో సబ్సిడీలు

జపనీస్ భాషా ఉపాధ్యాయులకు శిక్షణ అవకాశాలను విస్తరించడంతో పాటు జపనీస్ భాషా విద్యకు సంబంధించిన నిపుణులను భారత్‌కు పంపించటం ద్వారా సమర్థవంతమైన పాఠ్యాంశాలు, పుస్తకాలు రూపొందించేందుకు సహాయపడటం.

భారత్‌లో నిహోంగో పార్టనర్స్ ప్రోగ్రామ్ (దీర్ఘకాలిక) ప్రారంభించడం.. దీని కింద స్థానిక జపనీస్ భాషా ఉపాధ్యాయులు, విద్యార్థులకు సహాయపడేందుకు జపాన్ ప్రజలను మాధ్యమిక పాఠశాలలకు పంపుతారు.

పరిశ్రమ అవసరాలు, నైపుణ్యం కలిగిన సిబ్బంది విషయంలో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా జపాన్ ఫౌండేషన్ భారత్‌లో నిర్వహించే 360 గంటల ఉపాధ్యాయ శిక్షణా కోర్సును విస్తరించటం, మెరుగపరచటంపై దృష్టి సారించటం

జపనీస్ భాషా ప్రావీణ్య పరీక్ష (జేఎల్‌పీటీ), జపాన్ ఫౌండేషన్ టెస్ట్ ఫర్ బేసిక్ జపనీస్ (జేఎఫ్‌టీ–బేసిక్) విషయంలో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా భారత్‌లో జపనీస్ భాషా పరీక్షా కేంద్రాల సంఖ్య, సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రయత్నించటం.

అవగాహన, మద్దతు, సమన్వయాన్ని మెరుగుపరచడం:

రాబోయే 5 సంవత్సరాల తర్వాత కూడా ఈ బదిలీ కార్యక్రమాలు స్వయం సమృద్ధంగా కొనసాగేందుకు వీలుగా కావాల్సిన అవగాహనను పెంచేందుకు భాగస్వామ్య విభాగాలు ఉన్ని చురుకుగా పని చేయనున్నాయి. దీనికోసం ఇవి చేయనున్నాయి:

జపాన్‌లో ఉపాధి అవకాశాలు, జపనీస్ భాషా విద్యపై నైపుణ్యాభివృద్ధి – వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డీఈ), ఎన్ఎస్‌డీసీ, ఇతర భాగస్వాములందరిచే విశ్వవిద్యాలయాలలో ఉద్యోగ మేళాలు, ప్రకటనలతో కూడిన ప్రచార కార్యక్రమాలు, సోషల్ మీడియా ప్రచారం కార్యక్రమాలు

ఉద్యోగుల కోసం చూస్తోన్న కంపెనీలతో భారతీయులను అనుసంధానించేందుకు జపాన్‌లోని వివిధ రాష్ట్రాల్లో ఎన్ఎస్‌డీసీ సెమినార్లు నిర్వహించటం.

జపాన్ ప్రభుత్వ మద్దతుతో భారతీయ మిషన్లు, పోస్ట్‌లలో ఆన్–అరైవల్ సహాయం, ఓరియంటేషన్ వర్క్‌షాప్‌లు, ఫిర్యాదుల పరిష్కారం.

రెండు దేశాల మధ్య వివిధ రంగాలలో చలనశీలతను ప్రోత్సహించేందుకు సంబంధిత సమాచారాన్ని ఏకీకృతం చేయడానికి, పంచుకునేందుకు ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయటం

రెండు దేశాల్లో రాష్ట్రాల భాగస్వామ్యాలు, జపాన్‌లోని సంబంధిత రాష్ట్రాల్లో ఉన్న కంపెనీల నియామక కార్యక్రమాలతో భారతదేశంలోని రాష్ట్రాల నైపుణ్యభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలను సరిపోల్చటం ద్వారా ద్వారా మానవ వనరులు, నైపుణ్య బదిలీ.రెండు దేశాల మధ్య సిబ్బంది బదిలీని ప్రేరేపించడంపై చర్చించేందుకు మానవ వనరుల బదిలీ సదస్సును నిర్వహించటం.

అమలు... తదనంతర చర్యలు:

పైన పేర్కొన్న కార్యాచరణ ప్రణాళిక అమలుకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, జపాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పూర్తి బాధ్యత వహించనున్నాయి. ఇదే లక్ష్యంతో వార్షికంగా సంయుక్త కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ స్థాయి సమావేశం నిర్వహించనున్నాయి. రెండు దేశాల మధ్య మానవ వనరుల బదిలీలు, సహకారాన్ని ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన అదనపు చర్యలను కూడా వారు అన్వేషించనున్నారు. కార్యచరణ ప్రణాళిక అమలు కోసం విద్య, నైపుణ్యం, శాస్త్ర సాంకేతికత, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న చర్చా పద్ధతులు, వేదికలను కూడా ఉపయోగించుకోనున్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లను అసెంబ్లీలో మరోసారి చట్టం చేయండి

## -పార్టీ పరంగా వద్దె .. వద్దు..ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ ఆగష్టు 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); బీసీలకు స్థానిక



సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై రేపటి నుండి జరిగే అసెంబ్లీలో మరోసారి చట్టం చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేసారు .ఈసారి చట్టం చేస్తే తప్పనిసరిగా గవర్నర్ పాస్ చేస్తారు. జీవో తీసి ఎన్నికలు జరపవచ్చు. మంత్రివర్గ కమిటి చేసిన మూడు ప్రతిపాదనలో ఒకటి ఊా తీసి ఎన్నికలు జరపాలని చేసిన సిపార్సు పూర్తిగా సమర్దిస్తామన్నారు.బీసీ రిజర్వేషన్ల విషయంలో 42 శాతం పెట్టడానికి ఇష్టం లేక ప్రభుత్వం అనేక డైవర్షన్ పాలిటిక్స్ ఆడుతుంది. ఢిల్లీలో రెండు సార్లు ధర్నాలు చేశారు, ప్రతిరోజు సమావేశాలు ఏర్పాటు చేసి పేపర్లలో ఉత్తుత్తి ప్రకటనలు జారీ చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తూ మభ్యపెడుతున్నారు. నిజంగా ప్రభుత్వానికి చిత్త శుద్ధి యుంటే గవర్నర్ సంతకం పెట్టకపోతే సుప్రీంకోర్టులో మండమాస్ పిటిషన్ వేయవచ్చు. లేదా మరోసారి రేపటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశంలో బీసీ బిల్లు ప్రవేశపెట్టి తీర్మానం చేస్తే చట్టం తయారవుతుంది. జీవో జారీ చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వంకు పెంచడానికి ఇష్టం లేక కేంద్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుంది. తప్పించుకొనే ప్రయత్నం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపలేదు. ప్రధానమంత్రిని కలవడానికి ప్రయత్నం చేయలేదు. వాళ్ళ పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్ లో చర్చ చేయలేదు. బీహార్ దొంగ ఓట్లని అపవాదా చేస్తూ నెల రోజులు పార్లమెంట్ నడవకుండా స్తంభింపజేశారు.

# ఆపరేషన్ సిందూర్‌లో 50 ఆయుధాలు కూడా వాడలేదు : ఐఏఎఫ్ అధికారి



న్యూఢిల్లీ, ఆగష్టు 30:పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా మే 7వ తేదీన విరుచుకుపడింది. ఈ ఆపరేషన్‌లో దాయాదికి భారీ నష్టం వాటిల్లింది. భారత్ చేపట్టిన దాడులకు పాక్ కాళ్లబేరానికి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆ ఆపరేషన్‌కు సంబంధించిన కీలక విషయాలను ఎయిర్ స్టాఫ్ వైస్ చీఫ్ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ తాజాగా పంచుకున్నారు. ఈ ఆపరేషన్‌లో 50 కంటే తక్కువ ఆయుధాలనే వినియోగించినట్లు చెప్పారు.

ఓ జాతీయ మీడియా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 'పాక్‌తో ఘర్షణలు ఆపేందుకు ఐఏఎఫ్ చాలా తక్కువ ఆయుధాలనే వినియోగించింది. ఈ ఆపరేషన్‌లో 50 కంటే తక్కువ ఆయుధాలతోనే పాక్‌తో ఘర్షణలను ఆపగలిగాం. మన బలగాలు నియంత్రణ రేఖ వెంట అత్యంత కచ్చితత్వంతో పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని లక్ష్యాలను ఛేదించాయి. ఈ దాడులకు తట్టుకోలేక పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. మే 10న పాకిస్థాన్ సీజ్‌ఫైర్‌కు దిగొచ్చింది. యుద్ధాన్ని ప్రారంభించడం చాలా సులభం. కానీ దాన్ని ముగించడం అంత సులువైన పని కాదు. అందుకే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా మన బలగాలను సంసిద్ధంగా ఉంచాం' అని ఆయన చెప్పుకొచ్చారు.

# క్విజ్ పోటీలతోనే ప్రతిభ వెలుగులోకి వస్తుంది.. ధర్మారం ఎంఈఓ పోతు ప్రభాకర్



కరీంనగర్, ఆగష్టు 30:క్విజ్ పోటీలను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ధర్మారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మండల స్థాయిలో విద్యార్థులకు గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టులపై శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తూ విద్యార్థులంతా క్విజ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు.

ఉపాధ్యాయులు అందించిన విషయ పరిజ్ఞానాన్ని అందుకొని క్విజ్ పోటీలలో పాల్గొంటే పోటీ తత్వంతో పాటు ప్రతిభా పాటవాలు తెలుస్తాయని అన్నారు. ఈ పోటీలలో మండలంలోని వివిధ ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 28 మంది విద్యార్థులు, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 22 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ, గణిత భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర ఫోరంల నుండి రిసోర్స్ పర్సన్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సెకండరీ స్థాయి నుండి పీ జస్విక, ఈ జోషిత కేవీ సుభాషిని, ఎన్ సాయికుమార్, కే ప్రణయ్ ఎలిమెంటరీ స్థాయి నుండి టీ వర్షిని, బీ అనిల్ కుమార్, కే శ్రీ నిత్య, ఎం రిషిక, ఎన్ ఇంద్రప్రియదర్శిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలకు ఎంఈవో ప్రభాకర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ఏ షీలా, రిసోర్స్ పర్సన్లు కృష్ణమోహన్, విజయ్, రఘురాం రెడ్డి, వివిధ పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, సీఆర్పీ కుమారస్వామి పాల్గొన్నారు.

# వరదల మీద మాట్లాడుదాం అంటే.. బురద రాజకీయాలు మాట్లాడుకుందాం అంటున్నారు : హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగష్టు 30:వరదల మీద మాట్లాడుదామని అంటే.. వరదలు ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందామని కాంగ్రెస్ ప్రభుత్వం అంటున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుందని ఆయన ధ్వజమెత్తారు. బీఏసీ సమావేశం నుంచి వాకౌట్ చేసిన హరీశ్‌రావు.. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు.

వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం. కానీ ఆ రెండింటి మీద చర్చించరట. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చింది. వరదలు, యూరియా కొరతపై మాట్లాడాలని బీఆర్ఎస్ ప్రతిపాదించింది. ఈ రెండు అంశాలపై మాట్లాడాలని మేం కోరాం. వీటితో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. అంటు రోగాల మీద, గురుకులాల్లో కనీస సౌకర్యాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై, ఫోర్త్ సిటీ పేరు మీద జరుగుతున్న అక్రమాలు.. సీఎం కుటుంబ సభ్యుల పాత్రపై, ధాన్యం కుంభకోణంపై.. బాధ్యులపై, ప్రభుత్వ ఉద్యోగుల టీఏ, డీఏలు, పీఆర్సీపై, గోదావరి బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై, హైడ్రా కూల్చివేతలు పేదలు పడుతున్న భాదలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలని కోరాం. వీటికి ప్రభుత్వం అంగీకరించలేదు. దురదృష్టం ఏంటంటే రెండే రోజులు అసెంబ్లీ జరుపుతామని అంటున్నారు. అంటే ఇవాళ రేపు, ప్రజా సమస్యల మీద చర్చించకుండా సభను వాయిదా వేసుకొని పారిపోతున్నారు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

వరదల మీద మాట్లాడుదాం అంటే అది ప్రాధాన్యత కాదు బురద రాజకీయాలు మాట్లాడుకుందాం అంటున్నారు. ఎరువులు, రైతుల మీద మాట్లాడుకుందాం అంటే తొందర ఏముంది.. మెల్లగా మాట్లాడుదాం అంటున్నారు. ప్రభుత్వం ముందుకు రాకపోవడం వల్ల బీఏసీ నుంచి వాకౌట్ చేశాం. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల కంటే ముఖ్యమైంది ఏముంటుంది.. వరద బాధితులు కాక ప్రధాన ఎంజెండా ఏముంటుంది.. ఎరువుల కొరత, వరదలపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ప్రభుత్వ ధోరణి చూస్తే కాళేశ్వరం కమిషన్ రిపోర్టు పెట్టి బురద రాజకీయాలకు పాల్పడే ఆలోచనలో కనబడుతున్నారు. దాని మీద చర్చకు సిద్ధం.. బీఏసీకి అవకాశం ఇవ్వండి.. ఒక్క రోజు కాదు నాలుగు రోజులు మాట్లాడుకుందాం అని చెప్పాం. కానీ కష్టాల్లో ఉన్న రైతులు, వరద బాధితులపై మాట్లాడాలంటే ముందుకు రావడం లేదు అని కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

రేపు ఒక్క రోజే బీసీ బిల్లు, కాళేశ్వరం రిపోర్టుపై చర్చించి.. తర్వాత అసెంబ్లీ వాయిదా వేసుకుని పోతారట. ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు. ఎరువుల మీద చర్చించడానికి, వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రానందుకు వాకౌట్ చేశాం. కనీసం 15 రోజులు సభ నిర్వహించాలి. రేపటి ఎజెండా కూడా చెప్పడం లేదు.. రాత్రి 10కి చెప్తారట. మరి ఎప్పుడు ప్రిపేర్ కావాలి. ప్రజాపాలన అంటే ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా.. ఎజెండా నిర్ణయించకపోవడమేనా..? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. అర్థంపర్థం లేకుండా బీఏసీ సమావేశం జరిగింది. కేవలం బురద రాజకీయాలే తమకు ప్రాధాన్యత అన్న ధోరణిలో ప్రభుత్వం ఉందని హరీశ్‌రావు మండిపడ్డారు.

# మీ కపట నాటకాలు ఆపండి.. బిఆర్ఎస్ నేతలపై మంత్రి తుమ్మల ధ్వజం

హైదరాబాద్, ఆగష్టు 30: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు యూరియా కొరతపై చేస్తున్న ఆందోళనలను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఖండించారు. ఇదంతా కపట నాటకమని మండిపడ్డారు. యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వం కారణమా.. లేక కేంద్ర ప్రభుత్వమా.. కారణమేదో మీకు తెలియదా.. యూరియా సరఫరా కేంద్ర ప్రభుత్వం పరిధిలోని విషయమని పదేళ్ల మీ పాలనలో మీకు తెలియదా.. అంటూ బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. రైతుల ముసుగులో మీ ప్రేరేపిత ఉద్యమాలు ప్రజలు హర్షిస్తారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారం లేదనే అక్కసుతో రేవంత్ ప్రభుత్వాన్ని బదనం చేయాలనే దిగజారుడు రాజకీయం ఎవరి కోసం అంటూ ప్రశ్నించారు. జియో పాలిటిక్స్ వల్ల దేశీయ ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గట్టు లేక యూరియా కొరత ఉంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు ఎందుకు అంటూ మండిపడ్డారు. యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు ఎందుకని ఫైర్ అయ్యారు.

రేవంత్ రెడ్డి పాలనలో మూడు పంట కాలాల్లో యూరియా కొరత లేనీ విషయం మీకు తెలియదా, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యూరియా కొరత ఉంటే సీఎం రేవంత్ పై మీ శాపనార్థాలు ఏంటి అని నిలదీశారు. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తేనే తెలంగాణకు యూరియా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. రైతాంగం ప్రయోజనాల కంటే మీ రాజకీయ ప్రయోజనాల కోసం మీరు చేసే నాటకాలు రైతులు నమ్మే స్థితిలో లేరని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# స్వదేశీ ఏరో-ఇంజిన్ ప్రాజెక్ట్‌తో భారతదేశం స్వావలంబన వైపు ఒక ప్రధాన అడుగు వేసింది

న్యూఢిల్లీ, ఆగష్టు 30:"నేటి ఉగ్రవాదం, మహమ్మారి మరియు ప్రాంతీయ సంఘర్షణల యుగంలో, రక్షణలో స్వావలంబన కేవలం ఒక ఎంపిక కాదు, మనుగడ మరియు పురోగతికి ఒక షరతు. ఇది రక్షణవాదం గురించి కాదు, ఇది సార్వభౌమాధికారం మరియు జాతీయ స్వయంప్రతిపత్తి గురించి" అని రక్షా మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఆగస్టు 30, 2025న న్యూఢిల్లీలో '21వ శతాబ్దంలో యుద్ధం' అనే ఇతివృత్తంతో జరిగిన రక్షణ సమావేశంలో ప్రసంగిస్తూ అన్నారు. కొన్ని నెలల క్రితం ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశ సాయుధ దళాలు శౌర్యాన్ని ప్రదర్శించిన ముఖ్యమైన సమయంలో ఈ సమావేశం జరుగుతుందని ఆయన హైలైట్ చేశారు, అయితే సంఘర్షణలు, వాణిజ్య యుద్ధాలు మరియు అస్థిరత ప్రపంచ ప్రకృతి దృశ్యాన్ని రూపొందిస్తూనే ఉన్నాయి. భౌగోళిక రాజకీయ మార్పులు రక్షణ కోసం ఇతరులపై ఆధారపడటం ఇకపై ఒక ఎంపిక కాదని దేశానికి చూపించాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నొక్కి చెప్పారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, స్వావలంబన భారతదేశం మాత్రమే తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోగలదని ఎల్లప్పుడూ విశ్వసిస్తుందని ఆయన అన్నారు.

వాణిజ్య యుద్ధం మరియు సుంకాల యుద్ధం వంటి పరిస్థితులు నానాటికీ తీవ్రమవుతున్నందున, అనేక అభివృద్ధి చెందిన దేశాలు రక్షణాత్మక చర్యలను ఆశ్రయిస్తున్నాయని రక్షణ మంత్రి పేర్కొన్నారు. రక్షణలో స్వావలంబనను ఒంటరితనంతో కంగారు పెట్టకూడదని ఆయన నొక్కి చెప్పారు. "ఇది రక్షణవాదం కాదు. ఇది సార్వభౌమాధికారం గురించి. యువత, శక్తి, సాంకేతికత మరియు అవకాశాలతో కూడిన దేశం స్వావలంబన వైపు అడుగులు వేసినప్పుడు, ప్రపంచం ఆగి గమనిస్తుంది. భారతదేశం ప్రపంచ ఒత్తిళ్లను తట్టుకుని బలంగా ఎదగడానికి వీలు కల్పించే బలం ఇదే" అని ఆయన అన్నారు.

భారతదేశం పెరుగుతున్న స్వదేశీ రక్షణ సామర్థ్యాలకు ఆపరేషన్ సిందూర్ ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. స్వదేశీ పరికరాలను ఉపయోగించి సాయుధ దళాలు తమ లక్ష్యాలపై జరిపిన ఖచ్చితమైన దాడులు దార్శనికత, సుదీర్ఘ తయారీ మరియు సమన్వయం లేకుండా ఏ మిషన్ విజయవంతం కాదని నిరూపించాయని ఆయన అన్నారు. "ఆపరేషన్ సిందూర్ కొన్ని రోజుల యుద్ధం, భారతదేశం విజయం మరియు పాకిస్తాన్ ఓటమి కథగా అనిపించవచ్చు, కానీ సంవత్సరాల వ్యూహాత్మక తయారీ మరియు రక్షణ సంసిద్ధత దాని వెనుక చాలా కాలం పాటు కొనసాగింది" అని ఆయన అన్నారు. భారత దళాలు సంవత్సరాల తరబడి కష్టపడి పనిచేయడం, స్వదేశీ పరికరాలపై ఆధారపడటం ద్వారా ఈ ఆపరేషన్‌ను సమర్థవంతంగా మరియు నిర్ణయాత్మకంగా నిర్వహించాయని ఆయన నొక్కి చెప్పారు. భారతదేశ భవిష్యత్తు భద్రత కోసం సుదర్శన్ చక్ర మిషన్‌ను ఒక గేమ్ చేంజింగ్ చొరవగా రక్షణ మంత్రి అభివర్ణించారు. ప్రధానమంత్రి ప్రకటించిన ఈ మిషన్, రక్షణాత్మక మరియు దాడి సాంకేతికతలను ఉపయోగించి వచ్చే దశాబ్దంలో దేశవ్యాప్తంగా కీలకమైన ప్రదేశాలకు పూర్తి వైమానిక రక్షణను అందించాలని భావిస్తోంది. ఆపరేషన్ సిందూర్ నుండి పాఠాలను ఉటంకిస్తూ, ఆధునిక యుద్ధంలో వాయు రక్షణ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. ఆగస్టు 23, 2025న డిఆర్‌డిఓ స్వదేశీ సమీకృత వాయు రక్షణ ఆయుధ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించిందని, ఇది ఒకేసారి మూడు లక్ష్యాలను ఛేధించిందని, ఇది ప్రధానమంత్రి దార్శనికతను సాకారం చేసుకునే దిశగా మొదటి అడుగుగా నిలిచిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పూర్తి అమలుకు సమయం పడుతుందని, రక్షణ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఈ దిశలో నిర్ణయాత్మకంగా ముందుకు సాగిందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

"మా యుద్ధనౌకలన్నీ ఇప్పుడు భారతదేశంలోనే నిర్మించబడుతున్నాయి. ఇటీవల ఐఎన్ఎస్ హిమగిరి మరియు ఐఎన్ఎస్ ఉదయగిరి అనే స్టెల్త్ ఫ్రిగేట్‌లను ప్రారంభించడం, అధునాతన ఆయుధాలు మరియు ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలతో అమర్చబడి ఉండటం, విదేశాల నుండి ఎటువంటి యుద్ధనౌకలను కొనుగోలు చేయకూడదనే మన నావికాదళం యొక్క సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ నౌకలు ప్రపంచ స్థాయివి మరియు హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారతదేశం యొక్క బలాన్ని పెంచుతాయి" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ యుద్ధనౌకల నిర్మాణంలో పూర్తి స్వావలంబన వంటి స్వదేశీకరణ మైలురాళ్లను హైలైట్ చేస్తూ పేర్కొన్నారు.

# విద్యార్థినులకు పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలి.. జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య

కరీంనగర్, ఆగష్టు 30: విద్యార్థినులకు పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని ఎస్టీ గురుకుల విద్యాలయ సిబ్బందికి జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య సూచించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల విద్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. మధ్యాహ్నం సమయంలో ఆయన సందర్శించి డైనింగ్ హాల్ ను భోజనం చేస్తున్న బాలికలను కలిసి పరిశీలించారు. భోజనం ఎలా ఉందని బాలికలతో ఆయన మాట్లాడారు.

శుచికరమైన భోజనం అందించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా విద్యాలయంలో వంట సామాగ్రి నిలువ రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్నతాగునీటిని గురించి ప్రిన్సిపాల్ శ్రీలతను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రతిరోజు వండుతున్న కూరగాయలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వానకాల సీజన్ లో అప్రమత్తంగా ఉంటూ విద్యార్థినులకు రుచి, శుచికరమైన భోజనాన్ని అందిస్తే వారు ఆరోగ్యకరంగా ఉండి పాఠశాలలో ఆహ్లాదకరంగా విద్యను అభ్యసిస్తారని అన్నారు. అదేవిధంగా విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని, తాజా కూరగాయలను ఉండాలని వంట సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్‌లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు.. ఆసియాకప్ షెడ్యూల్‌లో మార్పులు..!

హైదరాబాద్, ఆగష్టు 30:ఆసియా కప్ పోటీలకు తటస్థ వేదికగా ఎంపికైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో ఎండలు మండిపోనున్నాయి. ఎడారి దేశంలో అయినందున సెప్టెంబర్‌లో అక్కడ పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశముంది. ఒకవేళ అదే జరిగితే ఎండవేడికి ఆటగాళ్లు చెమటలు కక్కాల్సిందే. ఉక్కపోత.. వేడి గాలుల తీవ్రతతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మెగా టోర్నీలో ఆటగాళ్లకు ఇలాంటి కష్టాలు రాకూడదని నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. 19 లీగ్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ ఫైట్ సమయంలోనూ మార్పులు చేశారు.

సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా పదిహేడో సీజన్ ఆసియా కప్ షురూ కానుంది. అయితే.. ఈ నెల ప్రారంభం నుంచి అక్కడ పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని, సాయంత్రం 6 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగనుందని స్థానిక వాతావరణ శాఖ చెబుతోంది. అంతటి ఎండలో మ్యాచ్‌లు అంటే ఆటగాళ్లు హడలెత్తిపోతారు. అందుకే.. బీసీసీఐతో పాటు శ్రీలంక, అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ బోర్డులు మ్యాచ్‌ల సమయాన్ని మార్చాలని నిర్వాహకులను కోరాయి. ఆసియా దేశాల బోర్డుల అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన యూఏఈ క్రికెట్.. డే-నైట్ మ్యాచ్‌ల షెడ్యూల్ మార్చింది.

# రామగుండం బల్దియాలోని మురుగు నీటి కుంటల్లో గంబూషియా చేప పిల్లలు




కరీంనగర్, ఆగష్టు 30:రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే.అరుణ శ్రీ ఆదేశాల మేరకు శనివారం దోమల లార్వా తినే గంబూషియా చేప పిల్లలను మున్సిపల్ సిబ్బంది మురుగు నీటి కుంటల్లో వదిలారు.

మత్స్యశాఖ సహకారంతో మొదటి దఫాలో 5 వేల గంబూషియా చేప పిల్లలను కరీంనగర్ నుంచి తెప్పించి నగరంలోని పలు మురికి వాడలను గుర్తించి కుంటలు, నీరు ఎక్కువగా నిలిచి ఉండే ప్రాంతాల్లో ఈ చేప పిల్లలను వదిలినట్లు కమిషనర్ తెలిపారు. లార్వా అంతరించిపోతే దోమలు సంతతి పెరగడానికి అవకాశం ఉండదన్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం, స్ప్రేయింగ్ కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా క్లీన్ లీ నెస్ టార్గెట్ యూనిట్స్ కూడా గుర్తించినట్లు తెలిపారు.

# మియాగి ప్రిఫెక్చర్‌లోని సెండాయ్‌లో సెమీకండక్టర్ సౌకర్యాన్ని ప్రధానమంత్రి సందర్శించారు

న్యూఢిల్లీ, ఆగష్టు 30:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ, జపాన్ ప్రధానమంత్రి శ్రీ షిగేరు ఇషిబాతో కలిసి ఈరోజు మియాగి ప్రిఫెక్చర్‌లోని సెండాయ్‌కు వెళ్లారు. సెండాయ్‌లో, ఇద్దరు నాయకులు సెండాయ్ రంగంలో ప్రముఖ జపాన్ కంపెనీ టోక్యో ఎలక్ట్రాన్ మియాగి లిమిటెడ్ (౧ఇఒ మియాగి)ని సందర్శించారు. ప్రపంచ సెమీకండక్టర్ విలువ గొలుసులో ౧ఇఒ పాత్ర, దాని అధునాతన తయారీ సామర్థ్యాలు మరియు భారతదేశంతో దాని కొనసాగుతున్న మరియు ప్రణాళికాబద్ధమైన సహకారాల గురించి ప్రధానమంత్రికి వివరించారు. సెండాయ్ సరఫరా గొలుసు, తయారీ మరియు పరీక్ష రంగంలో సహకారాన్ని ఏర్పరచుకోవడానికి రెండు దేశాల మధ్య ఉన్న అవకాశాల గురించి ఫ్యాక్టరీ సందర్శన నాయకులకు ఆచరణాత్మక అవగాహన కల్పించింది.

సెండాయ్ సందర్శన భారతదేశంలో పెరుగుతున్న సెమీకండక్టర్ తయారీ పర్యావరణ వ్యవస్థ మరియు అధునాతన సెమీకండక్టర్ పరికరాలు మరియు సాంకేతికతలో జపాన్ బలాల మధ్య ఉన్న పరిపూరకతను హైలైట్ చేసింది. జపాన్-ఇండియా సెమీకండక్టర్ సప్లై చైన్ భాగస్వామ్యంపై సహకార ఒప్పందంతో పాటు, భారతదేశం-జపాన్ పారిశ్రామిక పోటీతత్వ భాగస్వామ్యం మరియు ఆర్థిక భద్రతా సంభాషణ కింద కొనసాగుతున్న భాగస్వామ్యాలపై ఆధారపడి, ఈ రంగంలో సహకారాన్ని మరింతగా పెంచుకోవడానికి రెండు పక్షాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి.

ప్రధానమంత్రి మోదీ మరియు ప్రధానమంత్రి ఇషిబా సంయుక్తంగా జరిపిన ఈ పర్యటన, బలమైన, స్థితిస్థాపకమైన మరియు విశ్వసనీయమైన సెమీకండక్టర్ సరఫరా గొలుసులను అభివృద్ధి చేయాలనే భారతదేశం మరియు జపాన్ ల ఉమ్మడి దార్శనికతను కూడా నొక్కి చెప్పింది. ఈ పర్యటనలో తనతో చేరినందుకు ప్రధానమంత్రి ఇషిబాకు ప్రధానమంత్రి మోదీ తన కృతజ్ఞతను తెలియజేశారు మరియు ఈ వ్యూహాత్మక రంగంలో జపాన్‌తో కలిసి పనిచేయడానికి భారతదేశం యొక్క సంసిద్ధతను పునరుద్ఘాటించారు.

ప్రధానమంత్రి ఇషిబా సెండాయ్‌లో ప్రధానమంత్రి మోదీ గౌరవార్థం మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మియాగి ప్రిఫెక్చర్ గవర్నర్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లిలో ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ



ఖమ్మం, ఆగష్టు 30: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచి అధికారులు అభ్యంతరాలు స్వీకరించారు. శనివారం ఎంపీడీఓ టి.అంకుబాబు, ఎంపీఓ శ్రీనివాస రావు మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా, మరియు పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై సమావేశంలో చర్చించారు. పోలింగ్ బూత్‌లు, వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాను వివరించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలుపాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ గౌస్, ఎండీ హస్మర్ ఖాన్, సీపీఐ నుండి లక్ష్మీపతి, సీపీఎం నుండి కోబాల్, బీఆర్ఎస్ నుండి కొట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను వెంటనే అప్పగించాలి

– ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు

– జర్నలిస్టులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలించిన జర్నలిస్టుల బృందం



ఖమ్మం ఆగస్టు 30 (నేటినిజం ప్రతినిధి) :ఖమ్మం జర్నలిస్టులకు కేటాయించిన 23.02 ఎకరాల ఇళ్ల స్థలాలను ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు అప్పగించాలని, క్యాబినెట్ ఆమోదం పొంది, జీవో జారీ చేసి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా కూడా ఇంతవరకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించలేకపోవడం బాధాకరమని ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం లోని ఎస్ఆర్ గార్డెన్ సమీపంలోని ఎన్ఎస్పి కాల్వకట్టపై జర్నలిస్టులకు 23.02ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల ఆస్థలంలోని కొంత భాగంలో అధికారులు ఫెన్సింగ్ చేసి మొక్కలను నాటారు. కొందరు అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా విలువైన గ్రావెల్స్ ను తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జర్నలిస్టుల బృందం శనివారం జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలను పరిశీలిం చారు. అనేక అడ్డంకులు సృష్టిస్తూ జర్నలిస్టుల స్థలాలను సైతం ఇతరులకు కట్టబెట్టే వ్యవహారాన్ని తక్షణమే విరమించుకోవాలని, కాలయాపన చేయకుండా స్థానిక సంస్థలు ఎన్నికల కంటే ముందే జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలను అప్పగించాలని రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి జర్నలిస్టులు అంతా ఐక్యంగా కలిసి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు ముత్యాల కోటేశ్వరరావు, సాక్షి సబ్ ఎడిటర్ అచ్చిరెడ్డి, నమస్తే తెలంగాణ సబ్ ఎడిటర్లు సముద్రాల శ్రీధర్, ఎస్కే జానీ, సహాయ కార్యదర్శి మూల జీవన్ రెడ్డి, జర్నలిస్టు నేతలు పి.పానకాల రావు, ఉల్లోజు రమేష్, వెంకట రెడ్డి, ఐన్యూస్ బ్యూరో కే.నాగేశ్వరరావు, మోహన్, గోవింద్, అప్పారావు, ఎస్ డి యాదగిరి, రోజా, ప్రైమ్9 సాయి, పులి శ్రీను, పెంటి వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఉత్తరాది రాష్ట్రాల్లో జలవిలయం..



హైదరాబాద్, ఆగష్టు 30:ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఢిల్లీతోపాటూ ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, జమ్ము కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు ఎక్కడికక్కడ వరదలు సంభవించాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగివడ్డాయి. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. ప్రధాన నదులు, వాటి ఉప నదులు ప్రమాదకర స్థాయిని మించి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలు, వరదలకు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో జలవిలయానికి సంబంధించిన షాకింగ్ వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# నేవీ చిల్డ్రన్ స్కూల్, ఢిల్లీ తన వార్షిక దినోత్సవాన్ని - 2025 జరుపుకుంటుంది

న్యూఢిల్లీ, ఆగష్టు 30:నేవీ చిల్డ్రన్ స్కూల్, ఢిల్లీ తన వజ్రోత్సవ వార్షిక దినోత్సవాన్ని ఆగస్టు 29, 2025న తల్కటోరా ఇండోర్ స్టేడియంలో జరుపుకుంది. నావికా సిబ్బంది చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి మరియు ఔచిచిం అధ్యక్షుడు శ్రీమతి శశి త్రిపాఠి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నావికాదళ అధికారులు, ఆహ్వానితులు, అతిథులు మరియు తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. ఈ సంవత్సరం వార్షిక దినోత్సవానికి ఇతివృత్తం 'స్వదేశ్ అనురాగ్' – ఒకరి దేశం పట్ల ప్రేమ.

వార్షిక దినోత్సవ కార్యక్రమంలో భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వం మరియు జాతీయ గర్వాన్ని జరుపుకునే విద్యార్థుల విభిన్న ప్రదర్శనలు ఉన్నాయి. శాస్త్రీయ నృత్యం, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల దేశభక్తి ప్రదర్శన మరియు శక్తివంతమైన కొరియో-డ్రామా ఉన్నాయి, ఇవన్నీ దేశ పురోగతి మరియు రక్షణ దళాలకు నివాళిగా ముగిశాయి.

ఈ సందర్భంగా ఔఅా ఢిల్లీ ఉపాధ్యాయులు రూపొందించిన ప్రత్యేక 'డైమండ్ జూబ్లీ పాట'ను అధ్యక్షుడు ఔచిచిం విడుదల చేశారు.

స్కూల్ మ్యాగజైన్ 'యాంకర్' యొక్క 'డైమండ్ జూబ్లీ' ఎడిషన్‌తో పాటు, సిఎన్ఎస్ ఢిల్లీ విద్యార్థులు రాసిన కథల సంకలనం 'ఎ ఫ్లీట్ ఆఫ్ టేల్స్' అనే పుస్తకాన్ని కూడా నావల్ స్టాఫ్ చీఫ్ మరియు అధ్యక్షుడు ఎన్‌డబ్ల్యుడబ్ల్యుఏ విడుదల చేశారు.

విద్యా, క్రీడలు మరియు సహ-పాఠ్యాంశ రంగాలలో పాఠశాల యొక్క అద్భుతమైన పనితీరును నావల్ స్టాఫ్ చీఫ్ ప్రశంసించారు. విద్యా సౌకర్యాలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పాఠశాల ప్రయత్నాలను కూడా ఆయన ప్రశంసించారు. సైనిక్ స్కూల్ రేవాలో ప్రారంభమైన తన ఐదు దశాబ్దాల యూనిఫామ్ ప్రయాణం నుండి అమూల్యమైన జీవిత పాఠాలను పంచుకుంటూ, సిఎన్ఎస్ వ్యక్తులను బలంగా, తెలివిగా మరియు పదునుగా చేయగల "అదృశ్య సూపర్ పవర్"గా స్వీయ-క్రమశిక్షణ యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. ఇతర కీలకమైన అంశాలలో చదవడం, పట్టుదల మరియు వినయంతో పాటు ఆత్మవిశ్వాసం యొక్క ప్రయోజనాలు ఉన్నాయి. విద్యార్థులు పెద్ద కలలు కనాలని, కష్టపడి పనిచేయాలని, ఆత్మవిశ్వాసం, స్వీయ-అవగాహన మరియు నిస్వార్థతను పెంపొందించుకోవాలని సిఎన్ఎస్ విద్యార్థులను కోరింది. సమాజానికి తిరిగి ఇవ్వడం యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కిచెప్పారు మరియు 2047 నాటికి భారతదేశం యొక్క సంపన్నమైన మరియు విక్షిత్ భారత్ అనే దార్శనికతను సాకారం చేయడంలో విద్యార్థుల అంకితభావం మరియు స్ఫూర్తి కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# కనిపించే పరిశుభ్రతపై అధిక దృష్టి సారించి మురికి ప్రదేశాలను వేగంగా శుభ్రపరచాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది



న్యూఢిల్లీ, ఆగష్టు 30:స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0 పై గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలతో ఉన్నత స్థాయి వర్చువల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

కేంద్ర మంత్రి శ్రీ మనోహర్ లాల్ అధ్యక్షతన, శ్రీ తోఖాన్ సాహు మరియు కార్యదర్శి శ్రీ ౫ా. కటికితల సమక్షంలో, ఈ సమావేశం పట్టణ భారతదేశంలో కనిపించే పరిశుభ్రతకు మరియు పరిశుభ్రత లక్ష్య యూనిట్ల గుర్తింపు మరియు పరివర్తన యొక్క ద్విముఖ విధానానికి ప్రాధాన్యత ఇచ్చింది.

స్వచ్ఛతా హీ సేవ 2024 సందర్భంగా 8 లక్షలకు పైగా క్లీన్‌నెస్ టార్గెట్ యూనిట్లు రూపాంతరం చెందాయి, నిర్లక్ష్యం చేయబడిన, కష్టమైన మరియు చీకటి ప్రదేశాలను గుర్తించడం ద్వారా మరియు నిర్వచించిన కాలపరిమితిలో పరివర్తన మరియు సుందరీకరణను నిర్ధారించడం ద్వారా కనిపించే పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని MoHUA రాష్ట్రాలను కోరింది.

పట్టణ అభివృద్ధి మరియు విధాన అమలులో మార్పుకు చోదక యంత్రాలుగా కీలక పాత్రను హైలైట్ చేస్తూ, పరిశుభ్రత మరియు పట్టణ అభివృద్ధి ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని, వాటిని ఒకే నాణేనికి రెండు వైపులా అభివర్ణించారు.

ఈ పట్టణ భూములను సమయానుకూలంగా క్లియరెన్స్ చేయడానికి మంత్రిత్వ శాఖ ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది, ఇది రాష్ట్రాల ద్వారా క్రమం తప్పకుండా సమీక్షలు మరియు దూకుడు పర్యవేక్షణ, పౌరుల సమీకరణ మరియు స్వచ్ఛతా యాప్ ద్వారా సిటీయులను మ్యాపింగ్ చేయడానికి ఇంటర్‌ఫేస్, మ్యాప్ చేయబడిన సైట్‌ల యొక్క వేగవంతమైన ట్రాకింగ్ మరియు సమయానుకూల క్లియరెన్స్, భూమిని తిరిగి పొందేందుకు మరియు తిరిగి పేరుకుపోకుండా నిరోధించడానికి సుందరీకరణపై దృష్టి పెడుతుంది.

# గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అన్నదానం



కరీంనగర్, ఆగష్టు 30: గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ లో నెలకొల్పిన మట్టి గణనాథుడికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక పూజలు నిర్వహించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు మాట్లాడుతూ పర్యావరణంపై పిల్లలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో గత 5 సంవత్సరాలుగా మట్టి గణనాథులను నెలకొల్పి పూజలు చేయనున్నట్లు తెలిపారు.

అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తిపిరెడ్డి వెంకట్రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఏఆర్‌టీ ఫెర్టిలిటీ క్లినిక్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరణ

హైదరాబాద్, ఆగష్టు 30:దేశంలోనే ప్రీమియర్ ఐవీఎఫ్, ఫెర్టిలిటీ చికిత్సా కేంద్రంగా పేరొందిన ఏఆర్‌టీ ఫెర్టిలిటీక్లినిక్స్ ఇండియా సంస్థ తన అత్యాధునిక వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా అందరూ సందర్శించగలిగే డిజిటల్ అనుభవాలతో కూడిన సృజనాత్మక సూట్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. వ్యక్తిగతంగా, డిజిటల్ అనుభవాలను కలగలిపి ఇక్కడకు రావాలనుకున్న పేషెంట్లకు ముందుగానే అన్నీ ఎలా ఉంటాయో చూపించేందుకు ఈ సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫాంను రూపొందించారు. తద్వారా దేశంలో ఫెర్టిలిటీ చికిత్సలు మారుతున్న తీరును అందిస్తున్నరు.

ఇందులోభాగంగా ఎంపిక చేసిన దంపతులకు ప్రతి శనివారం వారి అత్యాధునిక ల్యాబ్ సందర్శన ఉచితంగా ఉంటుంది. ఇందులో అత్యాధునిక టెక్నాలజీ, అద్భుతమైన ప్రోసీజర్లు వారి భావి పిండాలను కాపాడే విధానాలు ప్రత్యక్షంగా చూడొచ్చు. ఈ ఎడ్యుకేషనల్ టూర్ల ద్వారా ఎంబ్రియో ట్రాకింగ్ , గుర్తింపు కోసం క్లినిక్‌లో ఉన్న ఆర్ఐ విట్నెస్ టెక్నాలజీ తెలుస్తుంది. దీంతో ఐవీఎఫ్ విధానంపై నమ్మకం కలుగుతుంది. ముందెన్నడూ లేనంత భద్రత, పరిశుభ్రమైన హ్యాండిలింగ్, ప్రతి అడుగులోనూ కచ్చితత్వంతో అండాల సేకరణ నుంచి వాటి బదిలీ, పిండాన్ని కాపాడడం వరకు అన్నీ పూర్తి భద్రతతో చేస్తారు.

సాంకేతికతతో కూడిన ఈ కచ్చితత్వం, విస్తృతమైన వైద్య నైపుణ్యం, రోగుల సమగ్ర సంరక్షణ వీటన్నింటివల్ల ఫలితాలు అద్భుతంగా వస్తాయి. దేశంలోనే అత్యధిక లైవ్ బర్త్ రేట్లను ఏఆర్‌టీ ఫెర్టిలిటీ క్లినిక్స్ నిరంతరం అందిస్తోంది.

పేషెంట్ ఎక్స్‌పీరియన్స్ ఆవిష్కరణ సందర్భంగా ఏఆర్‌టీ ఫెర్టిలిటీ క్లినిక్స్ ఇండియా ప్రాంతీయ అధిపతి గురుసిమ్రాన్ కౌర్ మాట్లాడుతూ "ప్రారంభ సమయం నుంచి ఏఆర్‌టీ ఫెర్టిలిటీ క్లినిక్స్ ఇండియా రోగులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. తల్లిదండ్రులు కావడం అనేది దంపతుల కల. వైద్యపరమైన, సంరక్షణ సేవలే కాదు, పూర్తిస్థాయి మద్దతు, అవగాహన, అత్యాధునిక సాంకేతికతలను ఈ చికిత్సలో భాగం. విజ్ఞానం అందడంలో అంతరాలను అంతం చేసి, రోగులందరిలో నమ్మకం కలిగించి, వారికి ఈ ప్రయాణంలోని ప్రతి అడుగులోనూ ప్రోత్సాహం అందించి, వాళ్లకు అవసరమైన, పొందాల్సిన ఫెర్టిలిటీ చికిత్సలు అందిస్తాం" అని తెలిపారు.

# ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో కలిసి లక్ష్మీపురంలో పీఏసీఎస్ భవనం ప్రారంభం



అమరావతి, ఆగషు 30: పెరుగుతున్న పోటీకి తోడు, విస్తరిస్తున్నకార్పొరేట్ బ్యాంకింగ్ రంగాన్నితలదన్నేలా పరపతి సంఘాలు పనిచేస్తున్నాయని కేడీసీసీ చైర్మన్, మాజీ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం పేర్కొన్నారు. ఆర్థిక అభివృద్ధికి చిరునామాగా పీఏసీఎస్ లు నిలుస్తున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా పీఏసీఎస్‌లో సరికొత్త హంగులతో నవ్య నూతనంగా వినియోగదారులకు సరికొత్త సేవలను అందిస్తున్నట్లు చెప్పారు.

ఎన్టీఆర్జి జిల్లాలోని తిరువూరు నియోజకవర్గంలోని లక్ష్మీపురంలో అత్యాధునిక హంగులతో కొత్తగా రూపొందించిన పీఏసీఎస్ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కె.ప్రమీలతో ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీపురం పరపతి సంఘం 24 కోట్ల రూపాయల లావాదేవీలను నిర్వహించడంతోపాటు కోటి రూపాయలకు పైగా డిపాజిట్లను కలిగి ఉండడం విశేషం అన్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో ధాన్యం వ్యాపారం కూడా పెద్ద ఎత్తున జరుగుతుందని సదుపాయాల కల్పనలో భాగంగా సరికొత్త గోడౌన్‌తో పాటు అన్ని మౌలిక సదుపాయాలతో కొత్త భవనం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

కొలికపూడి ఆధ్వర్యంలో అభివృద్ధి

అమరావతి జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడిగా అమరావతి రాజధాని కలల సహకారంలో కొలికపూడి శ్రీనివాసరావు పాత్ర ఎనలేనిదని నెట్టెం రఘురాం పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి కష్టమొస్తే ముందుండే వ్యక్తి కొలికపూడి అని, అలాంటి వ్యక్తి ఈ రోజున తిరువూరు శాసనసభ్యుడిగా ప్రజలందరి అభిమానాన్ని చూరగొన్నారని చెప్పారు. కొలికపూడి అంటే అభివృద్ధి.. అభివృద్ధి అంటే కొలికపూడి అని అన్నారు. ఆయన ఏడాది కాలంలో తిరువూరు నియోజకవర్గం కొలికపూడి ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

## రైతు లేని సమాజం ఊహించలేం..

నాడు.. నేడు.. ఎప్పుడైనా రైతులేని సమాజాన్ని ఊహించడం సాధ్యం కాదని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతుకు సహకారం ఎంతో అవసరమని, ఇందులో పరపతి సంఘాలు కీలక పాత్ర పోషించాలన్నారు. రైతులతో పాటు టూవీలర్ ఆటో లారీ కమర్షియల్ వాహనాలకు కూడా రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. హోమ్ లోన్స్ తోపాటు ఇంటి రిపేర్ కోసం, మార్ట్‌గేజ్ లోన్లు వ్యాపారం ఎడ్యుకేషన్‌లోన్లు ఇలా అన్నింటినీ పరపతి సంఘాలు అందించడం అభినందనీయమన్నారు. నేటి ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న పరిపతి సంఘాలు రానున్న రోజులలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కొనియాడారు.

# క్రీడా సంస్కృతిని పెంపొందించడంలో భారతదేశ చమురు & గ్యాస్ పిఎస్‌యులు మార్గదర్శక పాత్ర: హర్‌దీప్ సింగ్ పూరి




న్యూఢిల్లీ, ఆగష్టు 30:పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి ఈరోజు మాట్లాడుతూ, భారతదేశం క్రీడల కోసం తన విధాన దృష్టిని మరియు ప్రజా పెట్టుబడులను పెంచిందని అన్నారు. "ఈ విషయంలో, భారతదేశ చమురు మరియు గ్యాస్ పిఎస్‌యులు మార్గదర్శక పాత్ర పోషించాయి" అని మంత్రి నొక్కి చెప్పారు.

జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకోవడానికి పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఖూఖః) ఢిల్లీ సాకర్ అసోసియేషన్ మరియు సుదేవా అకాడమీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఆగస్టు 29ని భారత జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటారు ఎందుకంటే ఇది భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినం. ఖూఖః సభ్య కార్యదర్శి శ్రీమతి సబీనా చౌదరి మరియు సుదేవా ఢిల్లీ ఈఅ అధ్యక్షుడు శ్రీ అనుజ్ గుప్తా కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారతదేశ క్రీడా రంగంలో వచ్చిన పరివర్తనను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, శ్రీ పూరి ఇలా అన్నారు, "2014 తర్వాత, భారతదేశాన్ని 'క్రీడా దేశం'గా మార్చడానికి సమిష్టి కృషి జరిగింది. నిధుల పరంగానే కాకుండా, పోషకాహారం, క్రీడా శాస్త్రం మరియు కోచింగ్‌తో సహా మొత్తం పర్యావరణ వ్యవస్థ అభివృద్ధిలో కూడా యువకులు ఉన్నత స్థాయి విజయాన్ని సాధించాలనే వాగ్దానానికి ఇప్పుడు లోతైన మద్దతు ఉంది."

ఒక వారం క్రితం ముగిసిన పార్లమెంటు చివరి సమావేశంలో, క్రీడా సమాఖ్యలు మరియు సంస్థల పాలన చట్రాన్ని సరిదిద్దడానికి చారిత్రాత్మక జాతీయ క్రీడా పాలన బిల్లు, 2025 ఆమోదించబడిందని – తద్వారా జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

"ఫలితాలు ఈ పరివర్తన విధానాల విజయాన్ని ప్రదర్శిస్తాయి" అని మంత్రి గమనించారు. "గత పదేళ్లు దీనిని చూపించాయి: 2023 ఆసియా క్రీడలు మరియు 2024 పారా ఆసియా క్రీడలలో, మేము వరుసగా 107 పతకాలు మరియు 29 పతకాలు (7 బంగారు, 9 రజత మరియు 13 కాంస్య) రికార్డు స్థాయిలో సాధించాము."

PSPB సహకారాన్ని అభినందిస్తూ, శ్రీ పూరి ఇలా అన్నారు, "ఈ పరివర్తనను సాధించడంలో సహాయపడిన అనేక మంది వాటాదారులలో, PSPB ప్రత్యేకంగా ప్రస్తావించదగినది, ఇది దేశంలోని అతిపెద్ద క్రీడా ప్రోత్సాహక సంస్థలలో ఒకటి, ఇది 16 సభ్య సంస్థలను కలిగి ఉంది, అదే సమయంలో 19 క్రీడా విభాగాలలో పోటీలకు మద్దతు ఇస్తుంది మరియు నిర్వహిస్తుంది."

# ప్రశాంత వాతావరణంలో నిమజ్జనోత్సవం నిర్వహించుకోవాలి.. ఎమ్మెల్యే విజయరమణారావు

కరీంనగర్, ఆగష్టు 30: ఎంతో భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు పూజలందుకు గణనాథుల నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మున్సిపల్ అధికారులకు సూచించారు. మినీ ట్యాంక్ బండ్ (ఎల్లమ్మ గుండమ్మ చెరువు)పై నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే శనివారం పరిశీలించి పలు సూచనలు చేశారు.

వచ్చే నెల5న నిమజ్జనోత్సవం కాగా, పెద్దపల్లి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు భక్తులు భక్తి శ్రద్ధలతో గణపతులను నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి సింగరేణి సంస్థ సౌజన్యంతో 2 భారీ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శోభయాత్ర సజావుగా ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్, మున్సిపల్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లక్ష్మణ్‌రావు, ఎలక్ట్రిసిటీ ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# అల్పపీడనం ప్రభావం.. తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు..!

హైదరాబాద్, ఆగష్టు 30:తెలంగాణలో రాగల నాలుగు రోజులు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది. గతవారంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. వరదలు ముంచెత్తగా జనజీవనం అస్తవ్యస్తమైంది. తాజాగా వాతావరణశాఖ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. సెప్టెంబర్ 3వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి.. నైరుతి వైపునకు వంగి ఉందని పేర్కొంది.

ఈ క్రమంలో శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. సెప్టెంబర్ ఒకటిన రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే సూచన ఉన్నాయని వివరించింది.

2న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. 3న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# చౌటుప్పల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మొబైల్ సేవలు ప్రారంభం



నల్గొండ, ఆగషు 30: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మొబైల్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ డీఈ మల్లికార్జున్ అన్నారు. శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మొబైల్స్ సేవలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాత్రి వేళల్లో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైనప్పుడు వెంటనే మొబైల్ ట్రాన్స్ఫార్మర్ అమర్చే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా త్వరితగతిన సమస్యను పరిష్కారం చేసుకోవచ్చున్నారు. దాదాపు రూ.15 లక్షల వ్యయంతో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ పద్మ, ఏఈ రాజుల సతీశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బాబా బోధనలు రాబోయే తరాలకు అందించాలి



హైదరాబాద్, ఆగష్టు 30:సద్గురు పరమహంస పులాజి బాబా చూపిన ఆధ్యాత్మిక ధ్యాన సన్మార్గాలు ఎంతో గొప్పవని స్ఫూర్తితో చూపిన మార్గంతో ఎన్నో కుటుంబాలు బాగుపడ్డాయని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్అన్నారు. కొమురం భీం అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పట్నాపూర్‌లో సిద్దేశ్వర సంస్థాన్‌లో నిర్వహించిన సద్గురు పూలాజి బాబా 101వ జయంతి వేడుకలు అధికారికంగా, ఘనంగా జరిగాయి.

ఈ వేడుకల్లో ఎంపీతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొని బాబా సమాధి మందిరంలో ప్రత్యేక పూజలు చేసి బాబా ఆశీస్సులు పొందారు.

ఎంపీ మాట్లాడుతూ బాబా చూపిన మార్గంలో తాను 1994 నుండి రాజకీయాల్లో వచ్చినప్పటికీ బాబా ఆధ్యాత్మిక ధ్యాన బోధనలు చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో కాకుండా మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల్లో బాబా ప్రవచనాలు బోధనల వల్ల ఎన్నో కుటుంబాలు ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నాయన్నారు.

సమాజంలో అన్ని వర్గాలను ఏకతాటిపై చేర్చి ఆధ్యాత్మిక సన్మార్గాన్ని చూపిన మహనీయులన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ.. బాబా మన జీవితాల్లో మార్పు రావాలని చేసిన ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమన్నారు. బాబా మానవసేవయే మాధవసేవగా కృషి చేశారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యుడు సూచన మేరకు ఎంపీ నగేష్‌తోపాటు జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి సమస్త అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు బాబా తపస్సు చేసిన దామాజీ లోయకు రోడ్డుతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్, భక్తురాలు కమల బాబా జీవిత చరిత్ర ప్రవచనాల ధ్యాన మార్గాలపై రచించిన గ్రంథ పుస్తకాల క్యాసెట్టును ఎంపీ, కలెక్టర్, ఎస్పీ వక్తల సమక్షంలో విడుదల చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిర క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ క్రాంతి లాల్, కిన్వాట్ ఎమ్మెల్యే భీమ్రావు కేరం, మహారాష్ట్ర మాజీ మంత్రి శివాజీ రావు, మాజీ ఎమ్మెల్యే ఉత్తనీరావు ఇంగ్లె, మహారాష్ట్ర స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాందాస్, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ అజ్మీర శ్యాం నాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కతదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ ప్రజలపై గంగమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి

## -బిఆర్ఎస్ పట్టణ శాఖ

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మూల వాగు వద్ద గంగమ్మ తల్లికి బిఆర్ఎస్ పట్టణ శాఖ అధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మూల వాగులో నీరు పరవళ్లు తొక్కడం సంతోష దాయకం అన్నారు. గంగమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం మూలవాగు ప్రవహించినప్పుడు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. గంగమ్మ తల్లికి పూలు, పండ్లు, చీర సారెగా అందజేసి పసుపు కుంకుమ నీళ్లలో కలిపి అమ్మవారిని ఆశీర్వదించమని కోరుకున్నారు. ఈ సందర్భంగా జీవకోటికి ప్రాణాధారం నీరే కాబట్టి ఆటూ రైతాంగానికి పంటలు సంవృద్ధిగా పండాలనీ, ప్రజలంతా సంతోషంగా వీరజిల్లాలని నాయకులు అన్నారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి,నిమ్మశెట్టి విజయ్,మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు,మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సిరిగిరి చందు, నరాల శేఖర్,జోగిని శంకర్, ముద్రకోళ వెంకన్న,కందుల క్రాంతికుమార్,కోండ కనకయ్య,నాయకులు నరాల దేవేందర్,ప్రసాద్ రావు, మంతె సందీప్,వాసాల శ్రీనివాస్,ఉమర్,మ్యాకల శ్రీనివాస్, రాకేష్,పందుల శ్రీనివాస్,గోపు మధు,గుడిసె దేవరాజు,కృపాల్,వారిష్ గౌడ్,సాయి, బోల్లం దేవరాజ్,ఎండి వకిల్ తదితరులు పాల్గొన్నారు.

# వరసిద్ధి వినాయకుడికి దుర్గమ్మ పట్టు వస్త్రాలు

## -కాణిపాకంలో సమర్పించిన ఆలయ ఈవో శీనా నాయక్, వైదిక కమిటీ సభ్యులు, ఉద్యోగులు

## -ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన కాణిపాకం దేవస్థానం ఈవో కిషోర్



అమరావతి, ఆగష్టు 30:కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారికి కనకదుర్గమ్మ వారి పట్టు వస్త్రాలను సంప్రదాయ బద్ధంగా సమర్పించారు. కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను సమర్పించారు.

కాణిపాకం దేవస్థానానికి శనివారం వచ్చిన కనకదుర్గమ్మ ఆలయ ఈవో శీనా నాయక్, వైదిక కమిటీ సభ్యులు దేవస్థానం అధికారులకు కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను అందజేశారు. ఆశీర్వచన మండపం లో వీరికి పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఈవో పి కిషోర్ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశా రు. ప్రధాన అర్చకులు ఎల్. దుర్గాప్రసాద్, రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రంగారావు, ఏఈవో డాక్టర్ కే గంగాధర్, వైదిక కమిటీ సభ్యులు శ్రీధర్ శర్మ, దేవస్థానం అర్చకులు ఆర్ .శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

## -ప్రతిభ కనపరచిన వారికి సైకిల్స్ బహూకరణ

కరీంనగర్, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి) విద్యార్థులకు ప్రాథమిక దశనుండే పోటీతత్వాన్ని అలవర్చాలని, వివిధ రకాల పోటీ పరీక్షలలో పాల్గొనేదందుకు ప్రోత్సాహం అందించడంతోపాటు సంబంధించినటువంటి వనరులను, సమాచారాన్ని అందించినట్లయితే వారు తప్పనిసరిగా విజయం సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వినరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల ప్రతిభా పాటవ పోటిలను నిర్వహించాలని తద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయవచ్చని అన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించవచ్చని అభిప్రాయపడ్డారు.

నేటి సమాజంలో విద్యార్థులు పోటీతత్వాన్ని తప్పనిసరిగా అలవర్చుకోవడమే కాకుండా పోటీ పరీక్షలలో పాల్గొని వివిధ ప్రతిభా ఆధారిత కార్యక్రమాలలో పాల్గొని పై చెయి నిరూపించాలని వారు సూచించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత పెంపొందించడం లక్ష్యంగా ప్రముఖ సైకిల్ కంపెనీ సైకిల్ కంపెనీ బిఎస్ఏ హర్కులేస్ వారి సౌజన్యంతో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగిందని చెప్పారు.




ఈ వ్యాసరచన పోటీలలో అత్యుత్తమ వ్యాసాలను రూపొందించిన ఎం. ఆరాధ్య, బి.అక్షిత్ ప్రథమ ద్వితీయ స్థానాలను నిలవడమే కాకుండా సైకిల్స్ గెలుచుకున్నారని వారు హర్షం వ్యక్తం చేశారు. సుమారు 20 పైగా విద్యార్థులు చాలా చక్కటి వ్యాసాలను రూపొందించి ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. విద్యార్థులకు సైక్లింగ్ పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని, సైక్లింగ్ చేయడం వలన ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఎన్నో లాభాలు చేకూరుతాయని వచెప్పారు. చాలా చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించి నందుకు బిఎస్ఏ హర్కులెస్ కంపెనీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, హర్క్యెస్ కంపెనీ ప్రతినిధులు శంకర్, తదితరులు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ వినాయక మండపం అన్నదానం

వేములవాడ, ఆగస్ట్ 31:వేములవాడ పట్టణంలో గత కొన్ని సంవత్సరాల నుండి తెలంగాణ చౌక్ లో ఏర్పాటు చేస్తున్న గణేషునీ మండపం వద్ద మూడవరోజు బిఆర్ఎస్ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం భక్తులకు కొనసాగించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆ వినాయకుడు ఆశిస్సులు పేద ప్రజల వర్గాలకు ఉండాలనీ,ఆధ్యాత్మిక భావనతో పూజలు నిర్వహించి ప్రతి రోజు పూజలు జరుపుతూ అందరూ బాగుండాలని కోరుకున్నామని మనోహర్ రెడ్డి తెలి పారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్,సిరిగిరి చందు, నరాల దేవేందర్,నాయకులు మంతె సందీప్ మహేందర్ యాదవ్, దేవరాజ్,గోపు మధు,మారం మహేశ్ తదితర బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# సెప్టెంబర్ నెల నుండి నూతన రేషన్ కార్డు లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణి



ములుగు, ఆగష్టు 30:ములుగు జిల్లాలో ఆగస్ట్ 2025 నాటికి 8968 కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం జరిగినదని ,ఈ నూతన రేషన్ కార్డులలో మరియు కుటుంబ సభ్యుల చేర్పుల ద్వారా 33743 యూనిట్ల కు అదనంగా 205.029 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సెప్టెంబర్ 2025 మాసానికి గాను పంపిణి జరుగునని ,నూతన రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అర్హులైన పేదలు దరఖాస్తులు సమర్పించగలరనిజిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీ సయ్యద్ షా ఫైసల్ హుస్సైనీ తెలిపారు

# పాత పెన్షన్ సాధన పోరాట సభను విజయవంతం చేయాలి

## -డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘుశంకర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): :పాత పెన్షన్ సాధన పోరాట సభను విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘుశంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కోనాయపల్లిలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘు శంకర్ రెడ్డిపోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ ఒకటి నుండి అమలులోకి వచ్చినటువంటి కొత్త పెన్షన్ విధానం ఉద్యోగుల, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని అన్నారు.



కొత్త పెన్షన్ విధానం రద్దు కొరకు తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు సెప్టెంబర్ 1వ తేదీన , నల్ల బ్యాడ్జిలు ధరించి, నిరసన తెలిపిన కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులందరూ తరలివచ్చి కొత్త పెన్షన్ విధానంపై ఉన్నటువంటి వ్యతిరేకతను ప్రభుత్వానికి తెలియజేయాలని పేర్కొన్నారు.

అనంతరం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూర సదానందం మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కొరకు టీజాక్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీ నుండి నిరసన కార్యక్రమాలు ఉన్నాయని, సిపిఎస్ రద్దు అయ్యేంతవరకు సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విస్మరించకుండా సిపిఎస్ మహమ్మారిని రద్దు చేసినతరకు ప్రభుత్వంపై పోరాటం చేయడంలో భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షులు నారాయణరెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా డి టి ఎఫ్ ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్, మంగళగిరి చక్రపాణి, నిజానపు పర్శ రాములు , దేశెట్టి మల్లేశం, ఎలగందుల శ్రీనివాస్, వెంగళ శ్రీనివాస్,ఐలయ్య పాల్గొన్నారు.

# కాల్వశ్రీరాంపూర్‌లో సైన్స్ అండ్ గణిత క్విజ్ పోటీలు

కరీంనగర్, ఆగష్టు 30: కాల్వశ్రీరాంపూర్ మండల స్థాయి గణిత, సైన్స్ క్విజ్ క్లబ్ టాలెంట్ టెస్టును మండల కేంద్రంలోని హైస్కూల్లో శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పీ సాయి శివాని, కే నిశాంత్ ప్రథమ, ఎలిమెంటరీ స్థాయి నుండి పీ సాత్విక్, పీ సాయి కృతిక లు ప్రథమ స్థానం సాధించారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈవో మహేష్, అభినందించి మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ఉపాధ్యాయ సిబ్బంది జయప్రకాష్, సంతోష్ కుమార్, గణిత సైన్స్ పాల్గొన్నారు.

# గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో వైభవంగా గణేష్ నిమజ్జనం వేడుక..



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): . వేములవాడలోని గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో శనివారం వినాయక చవితి సందర్భంగా గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమా రమేష్ ఉపాధ్యాయులు,విద్యార్థులతో కలసి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.విద్యార్థులు ఆటపాటలతో వేడుకకు ప్రత్యేక శోభ తీసుకురావడంతో, కోలాహలం, నృత్యాలు మరియు పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా స్కూల్‌లో విద్యార్థులచే వినాయకుడిపై డ్రాయింగ్, ఎస్సే రైటింగ్‌లు నిర్వహించబడ్డాయి.కరస్పాండెంట్ బూర ఉమా రమేష్ మాట్లాడుతూ...ఈ కార్యక్రమం కేవలం ఒక వేడుక మాత్రమే కాకుండా, విద్యార్థులలో మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించే మనస్తత్వాన్ని పెంపొందించే గొప్ప అవకాశంగా నిలిచిందన్నారు..ఈ వేడుకల్లో స్కూల్ ప్రిన్సిపాల్ హరికిషన్, శివ సాయి చరణ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# రిఅష్యూర్ 3.0తో కొత్త మైలురాళ్లు సృష్టిస్తున్న నివా బుపా: పరిమితులు లేని కవరేజ్

ReAssure 3.0
Go Limitless

హైదరాబాద్, ఆగష్టు 30:నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ తన తాజా ఫ్లాగ్‌షిప్ ప్రొడక్ట్ రిఅష్యూర్ 3.0 ను ప్రారంభించింది. ఇప్పటి వరకు ఆరోగ్య బీమా ఉత్పత్తులను రూపొందించిన విధానాన్ని మార్చిపెట్టే ఈ విప్లవాత్మక ఆవిష్కరణలో మొదటిసారిగా అన్ లిమిటెడ్ బేస్ సమ్ ఇన్స్యూర్డ్ అందిస్తోంది. ఇప్పటివరకు ఉన్న నో క్లెయిమ్ బోనస్, ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లు, రిస్టోరేషన్/రీ-ఇన్‌స్టేట్‌మెంట్, అనుపయోగమైన సమ్ ఇన్స్యూర్డ్‌ను క్యారీ ఫార్వర్డ్ చేసుకోవడం, టాప్-అప్ ప్లాన్లు వంటి అన్ని పద్ధతులను ఇవి అమాన్యంగా మార్చేస్తున్నాయి. ఇదే సమయంలో, కేవలం రక్షణ మాత్రమే కాకుండా వెల్‌నెస్ ఆఫరింగ్‌లతో కూడిన ఆరోగ్య బీమా ఉత్పత్తుల కొత్త యుగానికి నాంది పలుకుతోంది.

సాంప్రదాయ ఆరోగ్య బీమా ఉత్పత్తుల్లో కస్టమర్లు తమ సమ్ ఇన్స్యూర్డ్ సరిపోతుందా అనే ఆందోళనలో ఉంటారు. రిఅష్యూర్ 3.0 ఆ సమస్యను శాశ్వతంగా తొలగిస్తుంది. క్లాసిక్, సెలెక్ట్, ఎలైట్, బ్లాక్ వంటి అన్ని వేరియంట్‌లలో అన్ లిమిటెడ్ బేస్ సమ్ ఇన్స్యూర్డ్ లభిస్తుంది.

ప్రతి క్లెయిమ్ ప్రతి సారి అన్ని రకాల వ్యాధులకు కవరేజ్ లభిస్తుంది. అదనంగా, కస్టమర్లు తమ ఇష్టానుసారం రూమ్ కేటగిరీని ఎంచుకోవచ్చు - జనరల్ రూమ్ నుండి ఎలాంటి గదులైనా ఎంచుకోవచ్చు.

రీఅష్యూర్ 3.0 ద్వారా మొదటి రోజు నుంచే 145 రకాల పూర్వస్థితి వ్యాధులకు కవరేజ్ అందుతుంది. ఇంత విస్తృతంగా డే 1 నుంచే పూర్వవ్యాధులను కవరేజ్ చేయడం ఇదే మొదటి సారి. కస్టమర్లు కొంత అదనపు ప్రీమియం చెల్లించి ఈ సౌకర్యాన్ని ఎంచుకోవచ్చు.

ఆసుపత్రి చికిత్సకే పరిమితం కాకుండా, ఆరోగ్య సంరక్షణ చాలా విస్తృతమని గుర్తించి రీఅష్యూర్ 3.0 ప్రత్యేకంగా వెల్‌కన్సల్ట్+ అనే ఆప్షనల్ బెనిఫిట్‌ను అందిస్తోంది.దీని ద్వారా చెల్లించిన ప్రీమియం మొత్తానికి 5 రెట్లు వరకు ఓపిడీ ఖర్చులకు కవరేజ్ లభిస్తుంది. ప్రారంభోత్సవం సందర్భంగా నివా బూపా డైరెక్టర్ & చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ భబతోష్ మిశ్రా మాట్లాడుతూ.

"నివా బూపాలో మేము ఎల్లప్పుడూ హద్దులను అధిగమిస్తూ, కస్టమర్లను ముందుంచే వినూత్న ఆవిష్కరణలను ఆరోగ్య బీమా రంగానికి తీసుకురావడానికి కృషి చేస్తూనే ఉన్నాం.

రీఅష్యూర్ 3.0 ద్వారా, మేము అనంతమైన సం ఇన్స్యూర్డ్ కవరేజ్ ను ఎలాంటి పరిమితి లేకుండా అందించడం పట్ల గర్వపడుతున్నాం. ఆరోగ్య సంరక్షణను ఆందోళనలేని అనుభవంగా మార్చే నిజమైన ముందడుగు అని మేము నమ్ముతున్నాం." అని అన్నారు.

# ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ కోసం బాదం తినండి

హైదరాబాద్, ఆగష్టు 30:ప్రముఖ శాస్త్రవేత్తల నుండి వచ్చిన కొత్త పరిశోధన, బాదం తినడం ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియాకు మద్దతు ఇస్తుందని సూచిస్తోంది ? ఇది మెరుగైన జీర్ణక్రియ, మొత్తం ఆరోగ్యానికి ఒక కీలక కారకం. ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా నిధులతో జరిగిన మొదటి పరిశోధన, బాదం ప్రీబయోటిక్స్‌గా పనిచేయడానికి గల ఆధారాలను సమీక్షించింది. అవి గట్ ఆరోగ్యానికి ఎలా ప్రయోజనం చేకూర్చగలవో వివరించింది.

ఈసందర్భంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ న్యూట్రిషన్ ఫర్ ప్రెసిషన్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్ లీడ్ అండ్ పేపర్ సహ-రచయిత, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో ప్రొఫెసర్, జాక్ గిల్బర్ట్ మాట్లాడుతూ? ఈ పరిశోధన బాదం ప్రీబయోటిక్స్‌గా పనిచేసి, గట్ ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడంలో నపాత్ర వహించవచ్చని సూచిస్తోందన్నారు. బాదంలో డైటరీ ఫైబర్, పాలీఫెనాల్స్ ఒలిగోశాకరైడ్లు వంటి జీర్ణంకాని కార్బోహైడ్రేట్లు ఉన్నాయి, ఇవి వాటి ప్రీబయోటిక్ ప్రభావాలను అందిస్తాయన్నారు. గట్ ఆరోగ్య ప్రయోజనాలను సాధించడానికి అవసరమైన బాదం



పరిమాణం, వాటిని ఎంతకాలం తినాలని నిర్ధారించడానికి అదనపు పరిశోధన సహాయపడుతుందని గిల్బర్ట్ అన్నారు.

పేపర్ సహ-రచయిత, ఫ్లోరిడా స్టేట్ యూనివర్సిటీలోని ది గట్ బయోమ్ ల్యాబ్ డైరెక్టర్, డా.రవీందర్ నాగ్‌పాల్ మాట్లాడుతూ? గట్-హార్ట్ యాక్సిస్ అనేది హృదయ సంబంధిత పరిశోధనలో అభివృద్ధి చెందుతున్న, ఉత్తేజకరమైన ఆసక్తికరమైన రంగం, తమ సాహిత్య సమీక్ష బాదం దీనిని సానుకూలంగా ప్రభావితం చేయగలదని సూచిస్తోందన్నారు.

న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట్, షీలా కృష్ణస్వామి మాట్లాడుతూ? శారీరక, మానసిక శ్రేయస్సుకు గట్ ఆరోగ్యం ఆధారం అని ఎక్కువగా చూడబడుతోందన్నారు. తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు, నట్స్ వంటి సరైన రకమైన ఆహారాలు తినడం ద్వారా గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వ్యాధిని నివారించడానికి, ఆరోగ్య కాలాన్ని పొడిగించడానికి చాలా ముఖ్యమన్నారు.

# రాజన్న ఆలయ ఈవోగా ఎల్ రమాదేవి బాధ్యతలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 30:(నేటినిజం ప్రతినిధి): శ్రీ రాజరాజేశ్వరి దేవస్థాన నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)గా ఎల్. రమాదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. రమాదేవి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వస్తి వచనాలతో వారిని స్వాగతించారు. కళ్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సహాయ నిర్వాహక అధికారి జి. శ్రావణ్ కుమార్ స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని శ్రీమతి రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జి శ్రీనివాస్ శర్మ, వెల్ది సంతోష్, వి వెంకట ప్రసాద్, ఎం రాజేందర్ (సీనియర్ అసిస్టెంట్), ఓ భాస్కర్, బొడుసు మహేష్, ఆలయ వేద పండితులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.